
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY
భద్రాద్రి కొత్తగూడెం
BHADRADRI KOTHAGUDEM
గురువారం, 9 మే 2024
5





	గరిష్ఠం	కనిష్ఠం
ఖమ్మం	39.9	22.4
భద్రాద్రి	40.0	26.0



ప్రజలు మళ్లీ మోసపోరు

- నా గెలుపు ఖమ్మానికే కాదు, తెలంగాణకూ అవసరం
- రాష్ట్రం కోసం మొదటి ఓటు వేసిన వాడిని
- ఖమ్మం జిల్లాలో రూ.50వేల కోట్లతో అభివృద్ధి చేశా..
- అసెంబ్లీ ఎన్నికల్లో ఓడినా.. లోక్‌సభలో గెలిచి తీరుతాం
- పార్టీ శ్రేణులు కసిగా పనిచేస్తున్నాయి
- కాంగ్రెస్, బీజేపీ మాటలను ఎవరూ నమ్మడం లేదు
- ఖమ్మం లోక్‌సభ బీఆర్ఎస్ అభ్యర్థి నామా నాగేశ్వరరావు

ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

ఖమ్మం, మే 8 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): రైతుబిడ్డగా, వ్యాపార సంస్థల అధిపతిగా రాజకీయాల్లోకి వచ్చిన నామా నాగేశ్వరరావు ఖమ్మం జిల్లాయే కాకుండా రాష్ట్ర, జాతీయ రాజకీయాల్లో తనకంటూ ఒక ముద్ర వేసుకున్నారు. తెలుగుదేశంలో నాడు లోక్‌సభ పక్ష నేతగా కీలక పాత్ర పోషించారు. బీఆర్ఎస్‌లో కూడా గత ఎన్నికల్లో ఖమ్మం ఎంపీగా గెలిచి బీఆర్ఎస్ లోక్‌సభ పక్ష నేతగా వ్యవహరించారు. ఖమ్మం లోక్‌సభ స్థానం నుంచి నాలుగుసార్లు పోటీ చేసి రెండు సార్లు గెలుపొందగా, రెండుసార్లు ఓటమి చెందారు. ఇప్పుడు ఐదోసారి ఎన్నికల బరిలో నిలిచి అదృష్టాన్ని పరీక్షించుకుంటున్న బీఆర్ఎస్ అభ్యర్థి నామా నాగేశ్వరరావుతో 'ఆంధ్రజ్యోతి' ఇంటర్వ్యూ...

ప్రశ్న: లోక్‌సభ ఎన్నికల్లో ప్రధానంగా మీరు తీసుకెళుతున్న ప్రచార అస్త్రాలు?

జవాబు: నేను బీఆర్ఎస్ లోక్‌సభ పక్షనేతగా తెలంగాణ రాష్ట్రం తరపున కేంద్రంతో కొట్లాడుతున్న వాడిని. ఖమ్మం లోక్‌సభ ఎన్నికల్లో నా గెలుపు ఖమ్మానికే కాదు, తెలంగాణ రాష్ట్రానికే అవసరం. లోక్‌సభలో గడిచిన ఐదేళ్ల తెలంగాణ రాష్ట్ర అభివృద్ధి కోసం కొట్లాడింది బీఆర్ఎస్ ఎంపీలు మాత్రమే. కాంగ్రెస్, బీజేపీలు ఏనాడూ నోరు మెదపలేదు. రైతు వ్యతిరేక చట్టాలతోపాటు అనేక బిల్లులకు వ్యతిరేకంగా పోరాడిన వాడిని నేను. రైతు బిడ్డగా మూడోసారి గెలిపించాలని విజ్ఞప్తి చేస్తున్నా.

ప్ర: రెండుసార్లు ఎంపీగా గెలిచిన మీరు ఖమ్మం లోక్‌సభ నియోజకవర్గ అభివృద్ధికి ఏమీ చేయలేదని ప్రత్యర్థి పార్టీలు ప్రచారం చేస్తున్నాయి. దీనికి మీ సమాధానం?

జ: తెలంగాణ రాష్ట్రం కోసం కేంద్రం పెట్టిన బిల్లుకు ఎంపీగా మొదటి ఓటు వేసిన వాడిని. రాష్ట్ర ఏర్పాటు కోసం ఆనాడు టీడీపీ తెలంగాణ పక్షాన లేఖ ఇచ్చిన వాడిని. నేను లోక్‌సభలో ప్రశ్నించడం ద్వారానే రక్షణ స్టీల్‌కు కేటాయించిన బయ్యారం ఉక్కు పరిశ్రమ అనుమతులను రద్దు చేశారు. నేను కేంద్రానికి చేసిన విజ్ఞప్తులతోనే జాతీయ రహదారులు మంజూరై పనులు జరుగుతున్నాయి. కొత్తగూడెం-కొవ్వూరు రైల్వేలైన్ మావోయిస్టు ప్రభావిత ప్రాంతం కింద అభివృద్ధి చేయాలని విన్నవించిన తర్వాతనే కేంద్రం రూ.704కోట్లు నిధులు మంజూరు చేసింది. అలాగే అన్ని రైల్వేస్టేషన్ల ఆధునీకరణకు నిధులు మంజూరు చేయించా. నిరుద్యోగులకు ఉద్యోగమేళా ఏర్పాటు చేసి ప్రైవేటు రంగసంస్థల్లో ఉద్యోగాలు కల్పించా. నామా ముత్తయ్య ట్రస్టు ద్వారా ఎందరికో సహాయం చేశా. లోక్‌సభలో పదేళ్లలో 690ప్రశ్నలు వేసి జాతీయ, అంతర్జాతీయ, రాష్ట్రీయ అంశాలు, సమస్యలపై స్పందించి మాట్లాడా. దీంతో నాకు బెస్ట్ పార్లమెంటేరియన్ గుర్తింపు కూడా కేంద్రం ఇచ్చింది. ప్రధానమంత్రి గ్రామీణ సడక్ యోజన పథకం ద్వారా రూ.158కోట్లతో రహదారులు మంజూరు చేయించి పూర్తి చేయించా.



ప్ర: బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ఏ అభివృద్ధి జరగలేదని ప్రత్యర్థి పార్టీలు విమర్శలు చేస్తున్నాయి... దీనికి మీ సమాధానం?

జ: కాంగ్రెస్, బీజేపీ వాళ్లు అన్నీ అబద్ధాలు చెబుతున్నారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో రూ.50వేల కోట్లతో అభివృద్ధి పనులు జరిగాయి. సీతారామ ప్రాజెక్టు, భద్రాద్రి పవర్ ప్రాజెక్టు, ఖమ్మం, కొత్తగూడెంలో మెడికల్ కాలేజీలు బీఆర్ఎస్ హయాంలోనే ఏర్పాటయ్యాయి. కొత్తగూడెం కేంద్రంగా జిల్లాను ఏర్పాటు చేశాం. ఇలా చెప్పుకుంటూ పోతే గ్రామస్థాయి నుంచి జిల్లా కేంద్రాల వరకు కోట్ల రూపాయలతో అభివృద్ధి పనులు జరిగాయి. రైతుబంధు, రైతుబీమా, దళితబంధు, కల్యాణలక్ష్మి, మిషన్ భగీరథ, మిషన్ కాకతీయ, పల్లె, పట్టణ ప్రగతి వంటి ఎన్నో పథకాలను బీఆర్ఎస్ ప్రభుత్వం అమలు చేసింది. కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారంటీలు చెప్పింది తప్ప, అమలు

మిగతా 7వ పేజీలో...



కాంగ్రెస్ కిసాన్ సెల్ సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి తుమ్మల, పక్కన అభ్యర్థి రఘురాంరెడ్డి

మాది రైతు సంక్షేమ ప్రభుత్వం

- ఆగస్టు 15నాటికి రైతులకిచ్చిన హామీలన్నీ నెరవేరుస్తాం
- రైతు భరోసా అమలు... రూ.2లక్షల రుణ మాఫీ...
- ప్రతిష్టాత్మకంగా పంటల బీమా పథకం
- 'సీతారామ' ద్వారా వైరా లింక్ కెనాల్‌కు గోదావరి జలాలు
- వరికి బదులు రైతులు పామాయిల్ సాగుపై దృష్టి పెట్టాలి
- లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు భారీ మెజారిటీ తేవాలి
- కిసాన్ సెల్ సమావేశంలో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

ఖమ్మం, మే 8 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి) : వచ్చే ఆగస్టు 15 నాటికి రైతులకు ఇచ్చిన హామీలన్నీ పూర్తి చేసి, తమది రైతు సంక్షేమ ప్రభుత్వమని నిరూపించుకుంటామని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పేర్కొన్నారు. రూ.2లక్షల రుణమాఫీ, ఎకరానికి రూ.15వేలు పంట సహాయం కింద రైతు భరోసా, పంటల బీమా పథకం అమలు చేయబోతున్నామని స్పష్టం చేశారు. 'సీతారామ' ఎత్తిపోతల పథకం ద్వారా వైరా లింక్ కెనాల్‌కు నీరు విడుదల చేసి సాగర్ ఆయకట్టును సస్యశ్యామలం చేయబోతున్నట్టు ప్రకటించారు. ఖమ్మం జిల్లా కేంద్రంలోని కాంగ్రెస్ కార్యాలయంలో బుధవారం కాంగ్రెస్ కిసాన్ సెల్ సమావేశంలో మంత్రి తుమ్మల మాట్లాడారు. జూన్ నుంచి వానాకాలం పంటల సీజన్ మొదలవుతున్నందున పంటల బీమా పథకాన్ని అమలు చేయబోతున్నామని, పంటల బీమా అమల్లో తెలంగాణ రాష్ట్రం దేశానికే మోడల్‌గా నిలవబోతుందన్నారు. రాష్ట్రంలో వచ్చే వ్యవసాయ సీజన్ నుంచి ప్రతి రైతు పంటకు, ప్రతి సెంట్ భూమిలో సాగయ్యే పంటకు బీమా పథకం రైతుల వారీగా అమలు కాబోతుందని, దీనికి టెండర్ల ప్రక్రియ పూర్తయిందని, రూ.2వేల కోట్లయినా, రూ.5వేల కోట్లయినా ప్రభుత్వమే పూర్తిగా 70లక్షల మంది రైతులకు ప్రీమియం చెల్లిస్తుందని పేర్కొన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో రైతుల బ్యాంకు రుణాల నుంచి ప్రీమియం కట్ చేసి ఏ రైతు పంట నష్టపోయినా పరిహారం ఇవ్వలేదని కనీసం బ్యాంకు రుణం కూడా చెల్లించలేదని గుర్తు చేశారు.

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సారథ్యంలో అధికారంలోకి వచ్చిన తర్వాత పంటల బీమా అమలు చేసి ఇన్సూరెన్సు కంపెనీలతో మాట్లాడి కొత్తవిధానం అమలుకు శ్రీకారం చుట్టామని స్పష్టం చేశారు. దేశంలో ఏ రాష్ట్రంలోలేని విధంగా, రైతు రూపాయి చెల్లించకుండా ప్రభుత్వమే ప్రీమియం చెల్లించి మోడల్‌గా పంటల బీమా పథకం అమలు కాబోతుందన్నారు.

అలాగే రైతు భరోసా కింద ఎకరానికి రూ.15వేలు పంట సాగు సహాయానికి వచ్చే జూన్ నుంచే అమలు చేయబోతున్నామని, గత మార్చిలో ప్రవేశపెట్టిన ఓటాన్ అకౌంట్ బడ్జెట్ కాకుండా జూన్‌లో పూర్తిస్థాయి బడ్జెట్ ప్రవేశపెట్టి రైతు భరోసాకు కూడా నిధులు కేటాయించడం జరుగుతుందని మంత్రి తుమ్మల స్పష్టం చేశారు. వరంగల్ డిక్లరేషన్‌లో హామీ ఇచ్చిన విధంగా ఆగస్టు 15నాటికి రైతులకు రుణమాఫీ చేసి ఆగస్టు 15నాడు స్వాతంత్ర్య దినోత్సవ ప్రసంగంలో ఎన్ని లక్షల మంది రైతులకు ఎన్నికోట్లు రుణ మాఫీ చేశామో ముఖ్యమంత్రి వినిపిస్తారని మంత్రి తుమ్మల పేర్కొన్నారు.

వానాకాలం సీజన్‌లో ఎరువులు, విత్తనాల కొరత లేకుండా ముందు జాగ్రత్తలు తీసుకున్నామని తెలిపారు. రైతులు అనుమతి పొందిన కంపెనీల నుంచి విత్తనాలు కొనుగోలు చేయాలని, అప్పుడే ఏదైనా పంట నష్టం జరిగితే ఆ రైతుకు పరిహారం వచ్చే అవకాశం ఉంటుందన్నారు. అకాల వర్షాలకు పలు జిల్లాల్లో రైతుల ధాన్యం తడిసి పోయిందని, తడిసిన ధాన్యం కొనుగోలు చేయాలని అధికారులకు సూచించడం జరిగిందని మంత్రి తుమ్మల వెల్లడించారు.

జిల్లాలో వరి పంటను తగ్గించి పామాయిల్‌తో పచ్చదనం చేయాలని, టన్నుకు రూ.15వేల ధర లభిస్తుందని, లక్ష కోట్ల విలువైన పామాయిల్‌ను కేంద్రం దిగుమతి చేసుకుంటుందని అందువల్ల వరిసాగు చేసే రైతులు పామాయిల్ సాగువైపు దృష్టి మళ్లించాలన్నారు. ఆగస్టు 15 నాటికి 'సీతారామ' ప్రాజెక్టు ద్వారా గోదావరి జలాలను వైరా, లంకాసాగర్ ప్రాజెక్టులకు మళ్లించి సాగర్ ఆయకట్టును సస్యశ్యామలం చేస్తామని స్పష్టం చేశారు. అసెంబ్లీ ఎన్నికల్లో రైతులు, రైతుకూలీలు, ఉద్యోగులు, కార్మికులు అన్నివర్గాలు కాంగ్రెస్‌ను గెలిపించారని, లోక్‌సభ ఎన్నికల్లో కూడా కాంగ్రెస్ విజయం కోసం రైతులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు కష్టించి పనిచేయాలన్నారు.

కాంగ్రెస్ అభ్యర్థి రామసహాయం రఘురాంరెడ్డి ప్రసంగిస్తూ కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు ఎన్నో హామీలు అమలు చేస్తుందని, రైతుబంధుతోపాటు ఆరు గ్యారంటీలు అమలు చేశామని, ఆగస్టు 15న రైతు రుణ మాఫీ జరగబోతుందని, ఖమ్మం ఎంపీగా ఒక్కసారి అవకాశం ఇవ్వాలన్నారు కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు దుర్గాప్రసాద్, కిసాన్‌సెల్ జిల్లా అధ్యక్షుడు మొక్కా శేఖర్‌గౌడ్ తదితరులు ప్రసంగించారు. ఈ సమావేశంలో మాజీ ఎమ్మెల్సీ బాలసాని లక్ష్మీనారాయణ, నాయకులు రాయల నాగేశ్వరరావు, నగర అధ్యక్షుడు జావీద్, దొబ్బల సౌజన్య, స్వర్ణకుమారి తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ కుట్రలను తిప్పికొట్టాలి..

- నిరుద్యోగులను మోసం చేసిన మోదీ
- ఖమ్మంలో రఘురాంరెడ్డిని గెలిపించాలి
- తెలంగాణ నిరుద్యోగ జేఏసీ చైర్మన్ కోటూరి మానవతారాయ్



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న మానవతారాయ్

ఖమ్మం చర్చికాంపౌండ్, మే 8: వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీని ఓడించి కాంగ్రెస్ పార్టీని అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకుడు.. తెలంగాణ నిరుద్యోగ జేఏసీ చైర్మన్ కోటూరి మానవతారాయ్ పేర్కొన్నారు. నగరంలోని ప్రెస్‌క్లబ్‌లో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఏడాదికి రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామని మాట ఇచ్చి భర్తీ చేయకుండా నిరుద్యోగులను మోసం చేసిన మోదీ, బీజేపీలను ఓడించి తీరుతామన్నారు. కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థలలో ఖాళీగా ఉన్న సుమారు 30 లక్షల ఉద్యోగాలు భర్తీ చేయకుండా, నిరుద్యోగ సమస్యను పెంచి పోషించిన బీజేపీకి ఓటమి తప్పదన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలను ఒక్కొక్కటిగా అమ్మివేస్తూ ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ ఉద్యోగాలను ఎత్తివేస్తూ పరోక్షంగా రాజ్యాంగంలో రిజర్వేషన్లను ఎత్తివేసే బీజేపీ కుట్రలను తిప్పికొట్టాలన్నారు. ఖమ్మం కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి రామసహాయం రఘురాంరెడ్డిని అత్యధిక మెజారిటీతో గెలిపించాలన్నారు. ఈ కార్యక్రమంలో నిరుద్యోగ జేఏసీ రాష్ట్ర ఆయకులు, కేయూ జేఏసీ చైర్మన్ మేడారపు సుధాకర్, తాళ్లపల్లి నరేష్, మహ్మద్ మహబూబ్‌పాషా, వినోద్, సుమన్, వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.



ర్యాలీకి హాజరైన జనం



ర్యాలీలో అభివాదం చేస్తున్న బీజేపీ అభ్యర్థి తాండ్ర, పక్కన రామనాథం, భంజ్‌దేవ్

మళ్లీ మోదీయే ప్రధాని

- కేంద్రంలో ఎన్డీయే సర్కారు రావడం ఖాయం
- ఖమ్మంలో బీజేపీ అభ్యర్థి తాండ్ర వినోద్‌రావును గెలిపించాలి
- బస్తర్ మహారాజు కమల్‌చంద్ర భంజ్‌దేవ్
- నగరంలో బీజేపీ-టీడీపీ భారీ ర్యాలీ

ఖమ్మం, మే 8 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): దేశంలో ఎన్డీయే తిరిగి అధికారంలోకి రాబోతుందని, మళ్లీ మోదీ ప్రధాని కాబోతున్నారని దేశం, రాష్ట్రంతోపాటు ఖమ్మం లోక్‌సభ నియోజకవర్గ అభివృద్ధి బీజేపీ గెలుపుతోనే సాధ్యమని బస్తర్ మహారాజు, కాకతీయ వారసుడు కమల్‌చంద్ర భంజ్‌దేవ్ పేర్కొన్నారు. బీజేపీ గెలుపుకోసం బీజేపీ, టీడీపీ, జనసేన, ఎంఆర్‌పీఎస్ కార్యకర్తలు సమష్టిగా కృషి చేయాలని కోరారు. ఖమ్మంలో బీజేపీ అభ్యర్థి తాండ్ర వినోద్‌రావు గెలుపు కోసం టీడీపీ కార్యాలయం నుంచి మయూరి సెంటర్‌వరకు ర్యాలీ, రోడ్‌షో నిర్వహించారు. ముందుగా టీడీపీ కార్యాలయంలో కాకతీయ వారసుడు, బస్తర్ మహారాజు కమల్‌చంద్ర భంజ్‌దేవ్, బీజేపీ అభ్యర్థి తాండ్ర వినోద్‌రావు, ఖమ్మం టీడీపీ లోక్‌సభ ఇన్‌చార్జి వాసిరెడ్డి రామనాథం, ప్రధాన కార్యదర్శి కేతినేని హరీష్, ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు కూరపాటి సునీల్ మాదిగ తదితరులు ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఇల్లెందు క్రాస్‌రోడ్, జడ్పీ సెంటర్ మీదుగా పాత బస్టాండ్ వరకు ర్యాలీ చేపట్టారు. మయూరి సెంటర్‌లో జరిగిన కార్నర్ సమావేశంలో కాకతీయ వారసుడు కమల్‌చంద్ర భంజ్‌దేవ్ ప్రసంగిస్తూ మోదీ మరోసారి ప్రధాని కావడం ఖాయమని, దేశంలో ఎన్డీయే కూటమి విజయం సాధించబోతుందన్నారు. ఖమ్మంలో టీడీపీ-బీజేపీ ఎన్డీయే కూటమికి ప్రజలు ఆదరణ చూపుతున్నారని, కాంగ్రెస్‌ను ప్రజలు నమ్మరని పేర్కొన్నారు. బీజేపీ అభ్యర్థి తాండ్ర వినోద్‌రావు ప్రసంగిస్తూ తాను ఖమ్మానికి పక్కా లోకల్ అని, బీజేపీ గెలిస్తేనే అభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. తన గెలుపు ద్వారా ఖమ్మం అభివృద్ధికి కేంద్రనిధులు వస్తాయని తెలిపారు. టీడీపీ ఖమ్మం లోక్‌సభ ఇన్‌చార్జి వాసిరెడ్డి రామనాథం ప్రసంగిస్తూ బీజేపీకి బేషరతుగా టీడీపీ మద్దతు ఇస్తున్నదని, ఎన్డీయే కూటమిలో భాగంగా ఖమ్మంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు బీజేపీని గెలిపించేందుకు కృషిచేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీజేపీ కార్పొరేటర్ దొంగల సత్యనారాయణ, ఖమ్మం అసెంబ్లీ కన్వీనర్ అల్లిక అంజయ్య, ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు.

నేడు డిప్యూటీ సీఎం భట్టి పర్యటన



మధిర, మే 8: డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క గురువారం మధిర, ఎర్రుపాలెం మండలాల్లో పర్యటించనున్నారు. గురువారం ఉదయం 10 గంటలకు హైదరాబాద్‌లోని ప్రజాభవన్‌లో ప్రారంభమై రోడ్డు మార్గం గుండా మధ్యాహ్నం 2 గంటలకు మధిర చేరుకుంటారు. మధిర నుంచి సాయంత్రం 4 గంటలకు ఎర్రుపాలెం మండలం బనిగండ్లపాడు వెళ్లి అక్కడ పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో పాల్గొంటారు. సాయంత్రం 6 గంటలకు తిరిగి మధిర వచ్చి మధిరలో జరిగే ఎన్నికల ప్రచారం, ఇతర కార్యక్రమాల్లో పాల్గొంటారని పార్టీ ప్రకటించింది.

ఎన్నికలు స్వేచ్ఛగా జరిగేలా చూడాలి



- ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు అప్రమత్తంగా పనిచేయాలి
- పోలింగ్ రోజున ముమ్మర తనిఖీలు చేపట్టాలి
- సమీక్ష సమావేశంలో కలెక్టర్ వీపీ గౌతమ్

7



పెనుబల్లిలో రోడ్‌షోకు హాజరైన జనం

6

హోరెత్తిన 'గులాబీ' ప్రచారం

బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి నామా నాగేశ్వరరావును గెలిపించాలని కోరుతూ పెనుబల్లిలో బుధవారం రాత్రి నిర్వహించిన ప్రచారం హోరెత్తింది. బీఆర్ఎస్ నేతలు వద్దిరాజు రవిచంద్ర, సండ్ర వెంకటవీరయ్య, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు కనగాల వెంకట్రావు, ఎంపీపీ లక్కినేని అలేఖ్య, జడ్పీటీసీ చెక్కిలాల మోహన్‌రావు తదితరులు రోడ్‌షో ప్రచారంలో పాల్గొన్నారు. ఖమ్మం జిల్లా రైతు బిడ్డగా తనను రెండు సార్లు పార్లమెంట్‌కు పంపారని, మరోసారి అవకాశం కల్పించాలని అభ్యర్థి నామా ఈ సందర్భంగా కోరారు. అలాగే సత్తుపల్లిలో జరిగిన పార్టీ శ్రేణుల సమావేశంలో కూడా బీఆర్ఎస్ నేతలు మాట్లాడుతూ పార్టీ గెలుపునకు సమష్టి కృషి చేయాలని పిలుపునిచ్చారు.

-పెనుబల్లి/సత్తుపల్లి

టీఎస్ ఈఏపీసెట్‌కు 2,069మంది హాజరు

ఖమ్మం ఖానాపురం హవేలి, మే 8: ఇంజనీరింగ్, అగ్రికల్చర్, ఫార్మసీ కోర్సుల్లో ప్రవేశాలకు గాను మంగళవారం ఈఏపీసెట్ అగ్రికల్చర్ పరీక్ష రెండో రోజు జిల్లాలో ప్రశాంతంగా నిర్వహించారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ఈ పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఖమ్మం జిల్లాలో 7, భద్రాద్రి కొత్తగూడెంలో రెండు పరీక్షా కేంద్రాలలో ఉదయం సెషన్లలో పరీక్ష నిర్వహించారు. ఖమ్మంలో ఉదయం సెషన్‌లో 1564మందికి 1465మంది పరీక్షకు హాజరుకాగా 99మంది గైర్హాజరయ్యారని జేఎన్‌టీయూ అధికారులు తెలిపారు. సత్తుపల్లిలో ఉదయం జరిగిన పరీక్షకు మొత్తం 430మంది విద్యార్థులకు 395మంది హాజరుకాగా, 35 మంది పరీక్షకు గైర్హాజరయ్యారని తెలిపారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో నిర్వహించిన పరీక్షకు మొత్తం విద్యార్థులు 220మందికి 209మంది పరీక్షకు హాజరుకాగా 11మంది పరీక్షకు రాలేదని అధికారులు తెలిపారు. కాగా 9, 10, 11 తేదీల్లో ఇంజనీరింగ్ విభాగంలో ప్రవేశాల కోసం పరీక్షలు జరగనున్నాయి.



బొగ్గుట్టలో హోరాహోరీ

- ఇల్లెందు సెగ్మెంటులో లోక్‌సభ ఎన్నికల సెగ

6

సిత్రాలు చూడరో..


ఖమ్మంలోని బుర్హాన్‌పురంలో ఎన్నికల ప్రచారంలో భాగంగా ఇస్త్రీ చేస్తున్న రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర


వైరాలో కాంగ్రెస్ అభ్యర్థికి ఓటు వేయాలని కూరగాయల చిరు వ్యాపారిని అభ్యర్థిస్తున్న ఎస్సీకార్పొరేషన్ మాజీ చైర్మన్ రవి


ఖమ్మం 23వ డివిజన్‌లో బ్యాలెట్ నమూనాను చూపుతూ ఓట్లు అడుగుతున్న మాజీమంత్రి పువ్వాడ అజయ్


కాంగ్రెస్ అభ్యర్థి విజయం కోసం ఉపాధి హామీ పనుల్లో పలుగుపట్టిన అశ్వారావుపేట ఎమ్మెల్యే జారే ఆదినారాయణ

మోదీకి అధికారం ఇస్తే రాజ్యాంగాన్నే మార్చుతారు

» ఆత్మీయ సమ్మేళనంలో రాజ్యసభ సభ్యురాలు రేణుకాచౌదరి


మాట్లాడుతున్న రాజ్యసభ సభ్యురాలు రేణుకాచౌదరి

ఖమ్మం సంక్షేమవిభాగం, మే 8: కేంద్రంలో బీజేపీ మరోసారి అధికారంలోకి వస్తే రాజ్యాంగాన్నే మారుస్తారని రాజ్యసభ సభ్యురాలు రేణుకాచౌదరి ఆరోపించారు. ఖమ్మం లోక్‌సభ కాంగ్రెస్ అభ్యర్థి రామసహాయం రఘురాంరెడ్డి ఎన్నికల ప్రచారంలో భాగంగా రేణుకాచౌదరి పలు ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్నారు. శ్రీశ్రీ హోటల్‌లో నిర్వహించిన కార్యక్రమంలో రేణుకాచౌదరి మాట్లాడుతూ బీజేపీ ప్రజా వ్యతిరేక విధానాలపై దుమ్మెత్తి పోశారు. రాష్ట్రంతో పాటుగా కేంద్రంలోను కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటుతోనే ప్రజాస్వామ్యయుతమైన పరిపాలన ప్రజలకు అందుతుందని అన్నారు. పదేళ్లుగా ప్రజలకు చేసిన అభివృద్ధిని మోదీ చెప్పుకోలేక హిందు, ముస్లింల మధ్య విద్వేషాలు రెచ్చగొట్టి ఓట్లు రాల్చుకునే ఆలోచన చేస్తున్నారని విమర్శించారు. ఈ కార్యక్రమంలో ఎంపీ అభ్యర్థి రఘురాంరెడ్డి, కార్పొరేటర్ దోడ్డా నగేష్, మాజీ ఎమ్మెల్సీ బాలసాని లక్ష్మీనారాయణ, ఖమ్మం ఏఎంసీ మాజీ చైర్మన్ మానుకొండ రాధాకిషోర్ తదితరులు పాల్గొన్నారు.



బొగ్గుట్టలో బాహాబాహీ

» ఆధిక్యం కోసం పార్టీల తహతహ
» మెజారిటీ కోసం కాంగ్రెస్ పోరు
» సత్తా చాటాలని బీఆర్ఎస్, బీజేపీ యత్నం
» అసెంబ్లీ ఎన్నికల నాటి ప్రాభవం దక్కేనా?

ఇల్లెందు సెగ్మెంట్‌లో లోక్‌సభ ఎన్నికల సెగ

ఇల్లెందు, మే 8: విలక్షణ తీర్పులకు నిలయంగా పేరొందిన ఇల్లెందు శాసనసభ నియోజకవర్గంలో లోక్‌సభ ఎన్నికల్లో ఆధిక్యాన్ని నిలబెట్టుకునేందుకు అధికార కాంగ్రెస్, తిరిగి పట్టు సాధించాలని ప్రతిపక్ష బీఆర్ఎస్, ప్రత్యామ్నాయంగా నిలిచి గెలవాలని బీజేపీ పార్టీలు తీవ్ర యత్నాలు సాగిస్తున్నాయి. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ సాధించిన భారీ మెజారిటీని మరింత పెంచుకోవాలనిఆ పార్టీ తహతహలాడుతోంది. ఇప్పటికే కాంగ్రెస్ అభ్యర్థి పోరిక బలరామ్‌నాయక్ విజయాన్ని కాంక్షిస్తూ నిర్వహించిన ఎన్నికల ప్రచార సన్నాహక సమావేశాల్లో మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, లోక్‌సభ ఎన్నికల్లో ఇల్లెందు నియోజకవర్గంలో కాంగ్రెస్‌కు 75 వేల ఓట్ల మెజారిటీని అందించాలని నిర్దేశించారు.

ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ఎమ్మెల్యే కోరం కనకయ్యకు రికార్డు స్థాయిలో మెజారిటీ లభించింది. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ఇల్లెందులోనే కాంగ్రెస్‌కు అత్యధిక ఆధిక్యం లభించడం గమనార్హం. ఆ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థిగా గెలుపొందిన కోరం కనకయ్య సమీప బీఆర్ఎస్ అభ్యర్థి బాణోత్ హరిప్రియపై 57,309 ఓట్ల మెజారిటీతో గెలుపొందారు. అసెంబ్లీ ఎన్నికల్లో కోరం కనకయ్యకు వ్యక్తిగత ఇమేజ్, కాంగ్రెస్ పవనాలు, ఆరు గ్యారంటీల హామీలను ప్రజల్లో బలంగా తీసుకెళ్లడం వలన ఇల్లెందు నియోజకవర్గంలో కాంగ్రెస్‌కు భారీ మెజారిటీ లభించింది. ఫలితంగా లోక్‌సభ ఎన్నికల్లో 75 వేల ఓట్ల మెజారిటీ సాధించాలని నేతలు నిర్దేశిస్తుండడంతో, పార్టీ శ్రేణులు ఈ మేరకు కృషి చేస్తున్నాయి.

గత శాసనసభ ఎన్నికల్లో ఓటమి చెందిన బీఆర్ఎస్ పార్టీ, ఇల్లెందు నియోజకవర్గంలో 2018 ఎన్నికల్లో లభించిన ఓట్లను సైతం పొందలేకపోయింది. 2018లో బీఆర్ఎస్ అభ్యర్థిగా పోటీ చేసిన కోరం కనకయ్యకు 67,757 ఓట్లు లభించగా, 2023 లో బీఆర్ఎస్ అభ్యర్థిగా పోటీ చేసిన బాణోత్ హరిప్రియకు 51,862 ఓట్లు మాత్రమే లభించడం గమనార్హం. బీఆర్ఎస్ నేతలు, ప్రజాప్రతినిధులు అనేక మంది కాంగ్రెస్ గూటికి చేరుకున్నారు. తుదకు బీఆర్ఎస్‌లో నిన్నటి వరకు లోక్‌సభ ఎన్నికల ప్రచారం చేసిన పలువురు నాయకులు కూడా కాంగ్రెస్‌లో చేరడంతో, బీఆర్ఎస్‌లో పోలింగ్‌నాటికి ఎవరు ఉంటారో, ఎవరు పోతారో తెలియని అయోమయ స్థితిలో ఆ పార్టీ నాయకులు కూరుకుపోయారు.

బీజేపీ లోక్‌సభ అభ్యర్థిగా పోటీ చేస్తున్న అజ్మీర సీతారామ్ నాయక్ గతంలో ఎంపీగా మహబూబాబాద్ లోక్‌సభ నియోజకవర్గంలో బీఆర్ఎస్ అభ్యర్థిగా పోటీ చేసి గెలుపొందారు. ఇల్లెందు నియోజకవర్గంలో గత శాసనసభ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థిగా పోటీ చేసిన దరావత్ రవీంద్రనాయక్‌కు కేవలం 2568 ఓట్లు మత్రమే లభించడం గమనార్హం. అయితే లోక్‌సభ ఎన్నికల్లో లోక్‌సభ ఎన్నికల్లో జాతీయ స్థాయి రాజకీయాలతో ముడిపడి ఉండడంతో, ఇల్లెందు సెగ్మెంటులో బీజేపీ ఓటింగ్ పెరుగుతందని ధీమాను ఆ పార్టీ నేతలు వ్యక్తం చేస్తున్నారు.

అయిదు రోజులు కష్టపడండి.. ఐదేళ్లు సేవలందిస్తా

» బీఆర్ఎస్‌తోనే అభివృద్ధి, సంక్షేమం
» ఖమ్మం బీఆర్ఎస్ లోక్‌సభ నియోజకవర్గ ఎంపీ అభ్యర్థి నామా నాగేశ్వరరావు
» సత్తుపల్లి, పెనుబల్లి మండలాల్లో విస్తృత ప్రచారం

సత్తుపల్లి/ పెనుబల్లి, మే 8: లోక్‌సభ ఎన్నికల్లో కార్యకర్తలు, నాయకులు అయిదు రోజులు కష్టపడి గెలిపిస్తే తాను ఐదేళ్ల పాటు సేవలందిస్తానని బీఆర్ఎస్ ఖమ్మం లోక్‌సభ నియోజకవర్గ అభ్యర్థి నామా నాగేశ్వరరావు అన్నారు. మంగవారం ఆయన సత్తుపల్లి, పెనుబల్లిలో ఎన్నికల ప్రచార కార్యక్రమాల్లో ప్రసంగించారు. ఖమ్మం జిల్లా ప్రజలు కష్టాల్లో ఉన్న సమయంలో ప్రస్తున్న పోటీ చేస్తున్న ఇతర నాయకులకు ప్రజలు గుర్తుకు రాలేదని విమర్శించారు. తాను రాజకీయాలకు ముందు నుంచే ప్రజా సేవలో ఉన్నానని చెప్పారు. ప్రస్తుతం పోటీలో ఉన్న వారు ఎన్నికల తరువాత ప్రజలకు కనిపించరని అన్నారు. రైతు బిడ్డగా తనను ఆశీర్వదించాలని కోరారు. కాంగ్రెస్ దశాబ్దాల పాలనలో ఆకలి చావులు చూసామని అన్నారు. బీఆర్ఎస్ అధికారంలోకి వచ్చిన తరువాత అన్ని రంగాల్లో అభివృద్ధి, సంక్షేమపథకాలు ప్రజలకు అందుబాటులోకి వచ్చాయన్నారు. కాంగ్రెస్ ప్రజలను మోసం చేసి ఆరు గ్యారంటీలు, 400పైగా హామీలుఇచ్చి అధికారంలోకి వచ్చిందని, నాలుగు నెలలు దాటిని ఇచ్చిన హామీలు నిలబెట్టుకోలేదన్నారు. కల్యాణ లక్ష్మీ, షాదీముబారక్, తులం బంగారం జాడ లేదని, వ్యవసాయ కూలీలకు రూ.15వేల భరోసావేయలేదని, విద్యార్థులు, నిరోద్యోగులను కూడా కాంగ్రెస్ మోసం చేసిందని ఆరోపించారు. పింఛన్లు రూ.4వేలకు పెంచుతామని ఇంత వరకూ పట్టించుకోలేదని, మహిళలకు రూ.2500 ఇస్తామని మోసం చేశారని అన్నారు. ఒక పక్క ప్రజలను మోసం చేస్తూనే మరో పక్క అన్ని హామీలు అమలు చేసామని రాహుల్ గాంధీ చెప్పటం హాస్యాస్పదం అన్నారు. తన హయాంలో భద్రాచలం-కొవ్వూరు రైల్వే లైను కోసం ప్రయత్నించి మంజూరు చేయించానని, అయితే ఏపీ ప్రభుత్వం తన వంతు వాటా నిధులు చెల్లించకపోవటంతో పనులు ప్రారంభం కాలేదన్నారు. జిల్లాలో రూ.పదివేల కోట్లతో జాతీయ రహదారులు మంజూరు చేయించానని చెప్పారు. రాష్ట్ర సమస్యల కోసం బీఆర్ఎస్ ఎంపీలు మాత్రమే కేంద్ర ప్రభుత్వంతో పోరాడగలరని చెప్పారు. మరోకసారి తనను ఖమ్మం లోక్‌సభ సభ్యుడిగా గెలింపించాలని కోరారు. కాంగ్రెస్‌లో సామాజిక న్యాయం లోపించిందని రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర, మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో ముస్లింలకు, యాదవులకు, మున్నూరు కాపులకు మంత్రి వర్గంలో స్థానం లేదన్నారు. సత్తుపల్లి నియోజకవర్గంలో గత 15 ఏళ్లుగా ఒక్కరిపై కూడా తప్పుడు కేసు పెట్టలేదని అన్నారు. విపక్ష పార్టీల వారిని గౌరవించిన సంస్కృతి కొనసాగిందన్నారు. సత్తుపల్లిలో షాదీఖానా, అంబేద్కర్ భవన్, రజక భవన్, పద్మసాని, గౌడ, బ్రాహ్మణ ఇతర సామాజిక వర్గాలకు భవనాలను మంజూరు చేయగా వీటిని పునాది దశలో నిలిపివేసారని అన్నారు. పాత గొడవలను తెరపైకి తెచ్చి కేసులు పెడుతున్నారని ఆరోపించారు. సత్తుపల్లిలో గాలిపీల్చుకోవాలంటే తమ అనుమతి కావాలని కొందరు ప్రవర్తిస్తున్నారని విమర్శించారు. నామా నాగేశ్వరరావు విజయానికి కృషి చేయాలని పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమాల్లో మునిసిపల్ చైర్‌పర్సన్ కూసంపూడి మహేష్, యాగంటి శ్రీనివాసరావు, కనగాల వెంకట్రావ్, ఎంపీపీ లక్కినేని అలేఖ్య, పట్టణ అధ్యక్షుడు రఫీ, జడ్పీటీసీలు చెక్కిలాల మోహన్‌రావు, ఏఎంసీ మాజీ చైర్మన్ చెక్కిలాల లక్ష్మణ్‌రావు, కూసంపూడి రామారావు, పాషా, కౌన్సిలర్లు ప్రవీణ్, రఘు, చాంద్ పాషా, నరుకుళ్ల శ్రీను, కోటగిరి సుధాకర్‌రావు, పసుమర్తి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.


సత్తుపల్లిలో ప్రసంగిస్తున్న సండ్ర వెంకటవీరయ్య

బీఆర్ఎస్‌కు ఓట్లు అడిగే నైతిక హక్కు లేదు

» మహబూబాబాద్ కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి పోరిక బలరాంనాయక్

మహబూబాబాద్ టౌన్, మే8: పదేళ్ల పాలనలో తెలంగాణను ఆర్థికంగా లూటీ చేసిన బీఆర్ఎస్‌కు ఓట్లు అడిగే నైతిక హక్కు లేదని మానుకోట కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థి పోరిక బలరాంనాయక్ అన్నారు. మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలలో బుధవారం ప్రచారం చేపట్టారు. వాకర్స్‌తో మాట్లాడి ఓట్లు అభ్యర్థించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాలుగున్నర కోట్ల ప్రజల ఆకాంక్షలను గుర్తించి, కాంగ్రెస్ పార్టీ తెలంగాణ రాష్ట్రాన్ని ఇస్తేమాజీ సీఎం కేసీఆర్ కుటుంబంలో నలుగురు మాత్రమే బాగుపడ్డారని ఆరోపించారు. బీఆర్ఎస్ సర్కార్ బంగారు తెలంగాణ నినాదంతో అప్పుల తెలంగాణను చేశారని విమర్శించారు. ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన వాగ్దానా లను తుంగలో తొక్కి కార్పొరేట్లకు మద్దతుగా నిలిచి దేశ సంపదను వారికి దోచిపెట్టిన బీజేపీని ఓడించి ఇంటికి సాగనంపాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో మానుకోట ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్, అర్బన్ అధ్యక్షుడు ఘనపురపు అంజయ్య, మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు ఖలీల్ అహ్మద్, పోతురాజు రాజు, శంతన్ రామరాజు పాల్గొన్నారు.


మానుకోటలో జిమ్ చేస్తున్న బలరాంనాయక్

మానుకోటలో గులాబీ జెండా ఎగరేస్తాం

» మానుకోట బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి మాలోత్ కవిత

అశ్వాపురం, మే 8: గత అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ హమీలతో ప్రజలు మోసపోయారని,తెలంగాణలో భవిష్యత్ బీఆర్ఎస్ పార్టీదేనని మహబూబాద్ బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి మాలోత్ కవిత అన్నారు. బుధవారం మండల పరిధిలోని మొండికుంటలో మాజీ ఎంపిపి కొల్లు మల్లారెడ్డి నివాసంలో ఏర్పాటు చేసిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆమె మాట్లాడారు. మతోన్మాద బిజేపి, మోసపూరిత కాంగ్రెస్‌ను ప్రజలు నమ్మటం లేదని,రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో మహబూబాద్‌లో గులాబి జెండా ఎగరటం ఖాయమన్నారు. బిఆర్ఎస్ గత పదేళ్లలో కేసిఆర్ సారథ్యంలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలే బిఆర్ఎస్‌ను గెలిపిస్తాయన్నారు. పోలింగ్ తేదీ వరకు కార్యకర్తలు బిఆర్ఎస్ విజయం కోసం సైనికుల్లా పనిచేయాలన్నారు. కార్యకర్తలకు, నాయకులకు పార్టీ అండగా ఉంటుందన్నారు. సమావేశంలో మాజీ మంత్రి సత్యవతి రాథోడ్, పినపాక మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావు, అశ్వాపురం జడ్పీటీసీ సూదిరెడ్డి సులక్షణ, తుమ్మలచెరువు ఎంపీటీసీ పూజిత, మాజీ ఎంపీపీ కొల్లు మల్లారెడ్డి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు కోడి అమరేందర్ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న మాలోత్ కవిత

కేసీఆర్ ఎంతో చేశారు.. నామాను గెలిపించి రుణం తీర్చుకోవాలి

ఎన్నికల ప్రచారంలో మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్

ఖమ్మం కార్పొరేషన్, మే 8: 'కేసీఆర్ మనకెంతో చేశారు... వేలకోట్ల రూపాయలు నిధులిచ్చి అభివృద్ధికి తోడ్పడ్డారు. ఖమ్మం ఎంపీ సీటు గెలిపించి ఆయన రుణం తీర్చుకోవాలి' అని మాజీమంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ పిలుపునిచ్చారు. బీఆర్ఎస్ ఖమ్మం ఎంపీ అభ్యర్థి నామా నాగేశ్వరరావు గెలుపును కాంక్షిస్తూ బుధవారం నగరంలోని 23, 44, 45, 49, 50, 51 డివిజన్లలో పరిధిలో మామిళ్లగూడెంలో నిర్వహించిన కార్నర్‌మీటింగ్‌లో ఆయన మాట్లాడుతూ ప్రజలు నమ్మి ఓట్లు వేసి గెలిపిస్తే కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల సంక్షేమాన్ని గాలికి వదిలేసి, వ్యక్తిగత ఆరోపణలకు దిగుతూ ఇచ్చిన హామీలను పక్కదారి పట్టిస్తున్నదన్నారు. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌కు పెద్ద కష్టం వచ్చినా, 70 ఏళ్ల వయసులో ప్రజలకోసమే మండుటెండల్లో బస్సుయాత్రలు చేస్తున్నారన్నారు. కేసీఆర్ గర్జించిన తరువాతే కాంగ్రెస్ ప్రభుత్వం భయపడి రైతుబంధు ఇచ్చారని పువ్వాడ పేర్కొన్నారు. కాంగ్రెస్ మాయమాటలను ప్రజలు నమ్మే పరిస్థితుల్లో లేరని, కళ్యాణలక్ష్మి పథకం కింద తులం బంగారం, యువతులకు స్కూటీలు, ఇలా పలుహామీలు ఇచ్చి అమలు చేయకపోవటంతో ప్రజలు తీవ్ర అసంతృప్తితో ఉన్నారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం మెడలు వంచేందుకు, ఇచ్చిన హామీలను అమలు చేసేందుకు ప్రజల మధ్యకు వచ్చిన కేసీఆర్‌కు మనం అండగా నిలిచి, బీఆర్ఎస్ అభ్యర్థి నామా నాగేశ్వరరావును గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నగర అధ్యక్షుడు పగడాల నాగరాజు, డీసీసీబీ మాజీ చైర్మన్ కూరాకుల నాగభూషణం,నాయకులు గుండాల కృష్ణ, పొన్నం వేంకటేశ్వర్లు, శీలంశెట్టి వీరభద్రం, జక్కుల లక్ష్మయ్య, లింగనబోయిన సతీష్, జక్కుల వెంకటరమణ, శేషు, ఆయా డివిజన్ల బీఆర్ఎస్ అధ్యక్ష, కార్యదర్శులు పాల్గొన్నారు.


ప్రసంగిస్తున్న మాజీ మంత్రి పువ్వాడ


అధికారులకు సూచనలిస్తున్న ఆర్వో వీపీ గౌతమ్

ఈవీఎంల సప్లిమెంటరీ ర్యాండమైజేషన్ పూర్తి

ఖమ్మం కలెక్టరేట్, మే 8: కొత్తగూడెం అసెంబ్లీ సెగ్మెంట్ పరిధిలో లోక్‌సభ ఎన్నికల పోలింగ్ కోసం రిజర్వ్ ఈవీఎంల సప్లిమెంటరీ ర్యాండమైజేషన్ ప్రక్రియ పూర్తయినట్లు ఖమ్మం పార్లమెంటు రిటర్నింగ్ అధికారి, జిల్లా కలెక్టర్ వీపీ గౌతమ్ తెలిపారు. బుధవారం పార్లమెంట్ ఎన్నికల రిటర్నింగ్ అధికారి, సాధారణ పరిశీలకుల తో కలిసి, కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో కొత్తగూడెం అసెంబ్లీ సెగ్మెంట్ రిజర్వ్ ఈవీఎంల సప్లిమెంటరీ ర్యాండమైజేషన్ ప్రక్రియ చేపట్టారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ ప్రతినిధి సరిపూడి గోపి సందేశ్, బీఎస్పీ ప్రతినిధి చెరుకుపల్లి నాగేశ్వరరావు, కాంగ్రెస్ పార్టీ ప్రతినిధి నల్లమల సత్యంబాబు, బీజేపీ ప్రతినిధి జీఎస్ఆర్‌పి. విద్యాసాగర్, తహసీల్దార్ రాంబాబు పాల్గొన్నారు.

హక్కుల రక్షణ కోసమే ఎన్నికల్లో పోటీ

» ఎన్డీ కేంద్ర కమిటీ నాయకులు సాధినేని, అవునూరి మధు

ఇల్లెందు, మే 8: ఏజెన్సీ ఖనిజసంపదలకు కాపాడుకునేందుకు ప్రజాసమస్య పరిరక్షణ, కార్మిక వర్గ హక్కుల పరిరక్షణ కోసమే న్యూడెమోక్రసీ మహబూబాబాద్ లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేస్తోందని ఎన్డీ కేంద్ర కమిటీ నాయకులు సాధినేని వెంకటేశ్వరావు, అవునూరి మధు వెల్లడించారు. మతోన్మాద మారణహోమాన్ని సృష్టిస్తున్న ఫాసిస్టు బీజేపీని, విప్లవ కారులను బూటకపు ఎన్‌కౌంటర్లలో కాల్చి చంపిన, ఎమర్జెన్సీ సంస్కృతి కలిగిన కాంగ్రెస్, నియంతలా మారిన బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలను ఓడించాలని పిలుపునిచ్చారు. పార్లమెంట్ ఎన్నికల్లో రెండు న్యూడెమోక్రసీ పార్టీల ఉమ్మడి అభ్యర్థి మోకాళ్ల కృష్ణ విజయాన్ని కాంక్షిస్తు బుధవారం ఇల్లెందులో రోడ్ షో, సభ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎన్డీ రెండు పార్టీల కేంద్ర కమిటీ నాయకులు గోవార్ధన్, శ్రీనివాస్, ఎంపీ అభ్యర్థి మోకాళ్ల మురళీ కృష్ణ, రాష్ట్ర నాయకులు గౌని ఐలయ్య, బండారి ఐలయ్య, రాసుద్దిన్, సీతరామయ్య, నాగేశ్వరావు ప్రసంగించారు.


ప్రసంగిస్తున్న సాధినేని వెంకటేశ్వరావు

కాంగ్రెస్ అభ్యర్థి రఘురాం రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలి

» వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు
» ప్రైవేటు విద్యాసంస్థల సంఘం ఆధ్వర్యంలో ఆత్మీయ సమ్మేళనం

ఖమ్మం ఖానాపురంహవేలీ, మే 8: ఖమ్మం కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి రామసహాయం రఘురాంరెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరావు కోరారు. బుధవారం ప్రైవేటు విద్యాసంస్థల సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన ఆత్మీయ సమ్మేళనంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ హయాంలోనే అన్ని వర్గాల అభ్యున్నతి సాధ్యమవుతుందని అన్నారు. విద్యా, ఉపాధి, ఉద్యోగ రంగాల్లో ఉన్నతి కోసం కాంగ్రెస్‌ను గెలిపించాలని అన్నారు. ఖమ్మం లోక్‌సభ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి రామసహాయం రఘురాంరెడ్డి మాట్లాడుతూ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ చేతి గుర్తుకు ఓటు వేసి తనను గెలిపించాలని కోరారు. రాజ్యసభ సభ్యురాలు రేణుకాచౌదరి మాట్లాడుతూ ఖమ్మం జిల్లాలోని ప్రైవేటు పాఠశాలల యజమానులు కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి రామసహాయం రఘురాంరెడ్డిని ఓట్లు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పొంగులేటి ప్రసాద్‌రెడ్డి, మువ్వా విజయ్‌బాబు, గుర్రం కాంతారావు, వీరారెడ్డి, ఐవీ రమణారావు, రవిమారుత్, పార్వతీరెడ్డి పలువురు విద్యా సంస్థల అధిపతులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


ఆత్మీయ సమ్మేళనంలో మాట్లాడుతున్న మంత్రి తుమ్మల

అలవికాని వాగ్దానాలు చేసిన కాంగ్రెస్‌ను చిత్తుగా ఓడించండి

» రైతు బిడ్డగా రూ.వేల కోట్లతో జిల్లాను అభివృద్ధి చేశా
» బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి నామా

ఖమ్మం కార్పొరేషన్/ కల్లూరు/ కారేపల్లి/ బోనకల్/ మధిర, మే8: అసెంబ్లీ ఎన్నికల్లో అలవికావాగ్దానాలు చేసి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్‌పార్టీని పార్లమెంట్ ఎన్నికల్లో గట్టిగా బుద్ధి చెప్పాలని బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి నామా నాగేశ్వరరావు అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆయన బుధవారం ఖమ్మం, కల్లూరు, కారేపల్లి, బోనకల్, మధిరలో ఆయన పలు సమావేశాల్లో మాట్లాడారు. తాను ఎన్నికల్లో గెలిచినా, ఓడిన ప్రజల మధ్యనే ఉంటానని చెప్పారు. గత పార్లమెంట్ ఎన్నికల్లో ఏ విధంగా తానను కల్లూరు మండలం నుంచి మోజారిటీ తెప్పించారో అదే స్ఫూర్తితో ఈ ఎన్నికల్లో రెట్టింపు మోజారిటీ తీసుకోరావాలన్నారు. రైతుబిడ్డగా పది ఏళ్ల ఎంపీగా వేలాది కోట్ల నిధులు తెచ్చి జిల్లాను అభివృద్ధి చేశానని, మరోసారి ఆశీర్వదించాలని విజ్ఞప్తి చేశారు. తాను ఎంపీగా ఎన్నికైన తరువాత 10వేల కోట్ల నిధులతో జాతీయ రహదారులను తీసుకొచ్చానని గుర్తు చేశారు. బీఆర్ఎస్ అమలు చేసిన సంక్షేమ పథకాలు చారిత్రాత్మకమన్నారు. తొలుత ఆయన ఖమ్మంలోని అయ్యప్పస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. బీఆర్ఎస్ అభ్యర్థి నామ నాగేశ్వరావు గెలుపు ఈ జిల్లాకు ఎంతో అవసరమని ఆయన తనయుడు నామ పృథ్వీతేజ అన్నారు. బుధవారం నామ గెలుపు కోసం ఆయన మధిరలో ప్రచారం నిర్వహించారు.


బోనకల్‌లో మాట్లాడుతున్న నామా

ఐటీఐలలో ఇష్టారాజ్యం

- విద్యాప్రమాణాలను గాలికొదిలేసిన యాజమాన్యాలు
- రేకుల షెడ్లలో తరగతుల నిర్వహణ
- ట్రేడ్ పరికరాలు లేక ప్రాక్టికల్స్ నిల్
- అటెండెన్స్ పేరుతో విద్యార్థుల నుంచి డబ్బుల వసూళ్లు
- పట్టించుకోని ఉపాధి, శిక్షణ శాఖ అధికారులు

ఖమ్మం ఖానాపురం హవేలి, మే 8: జిల్లాలోని ప్రైవేటు పారిశ్రామిక శిక్షణ సంస్థ(ఐటిఐ)లో విద్యాప్రమాణాలు నానాటికీ దిగజారుతున్నాయి. ఉపాధి, శిక్షణ శాఖ అధికారుల పర్యవేక్షణ లేకపోవటంతో యాజమాన్యాలు ఇష్టారీతిన వ్యవహరిస్తున్నాయి. ఖమ్మం జిల్లాలో తొమ్మిది ప్రైవేటు, ఒక ప్రభుత్వ ఐటీఐలున్నాయి. వీటిలో ఫిట్టర్, టర్నర్, ఎలక్ట్రికల్, మెకానికల్, డీజీల్ మెకానిక్, వెల్డర్ తదితర కోర్సుల్లో సుమారు వెయ్యి మంది విద్యను అభ్యసిస్తున్నారు. ఆయా కాలేజీల్లో సరైన సౌకర్యాలు ఉన్నాయా.. లేవా.. అనే విషయాలను అధికారులు పట్టించుకోవడం లేదు. కాలేజీల్లో తరగతులు నడవక, ప్రాక్టికల్స్ నిర్వహించక విద్యార్థుల పరిస్థితి అగమ్యగోచరంగా మారుతోంది. ఐటీఐలలో ప్రవేశం పొందితే ఉద్యోగం వస్తుందని.. లేదంటే స్వయం ఉపాధి అయినా లభిస్తుందన్న ఆశతో చేరిన విద్యార్థులకు నిరాశ ఎదురవుతోంది. ఆయా ట్రేడ్‌లలో బోధించేవారు లేక తరగతి గదుల్లో ఖాళీగా కూర్చోవాల్సి వస్తోంది.

వాట్సాప్ చదువులు..

జిల్లాలోని పలు ప్రైవేటు ఐటీఐల్లోని విద్యార్థులకు కనీసం పుస్తకాలు కూడా అందివ్వలేని పరిస్థితి నెలకొంది. ఫలితంగా వాట్సాప్ చదువులు దిక్కవుతున్నాయి. ఉన్న ఒక పుస్తకాన్ని అందరికీ ఇవ్వడం కుదరకపోవడంతో వాట్సాప్ గ్రూపులు రూపొందించి ఆ పుస్తకాలకు సంబంధించి ఆ రోజు నేర్పిన అంశాన్ని ఫోటోలు తీసి వాట్సాప్ గ్రూపుల్లో పోస్టులు చేస్తున్నారు. దీంతో ఆ విద్యార్థులు ఆ మేసేజ్‌ల ఆధారంగా రికార్డుల్లోకి ఎక్కించుకుంటున్నారు. కాలేజిలలో ట్రేడ్‌ల వారీగా వాట్సాప్ గ్రూపులను తయారు చేసి అందులో నోట్సును పోస్ట్ చేస్తున్నారు.


రేకుల షెడ్డులో నిర్వహిస్తున్న ఓ ప్రైవేట్ కళాశాల

అధ్యాపకులెక్కడ

ఎంతో వ్యయ ప్రయాసలకోర్చి ఆయా కోర్సుల్లో అడ్మిషన్ పొందిన వారికి తీరా కాలేజీలకు వెళ్లగానే నిరాశే ఎదురవుతోంది. ఆయా కాలేజీలలో సంబంధిత సబ్జెక్టులను బోధించే అధ్యాపకుల కొరత కనిపిస్తోంది. దీంతో పలు కాలేజీలలో సీనియర్ విద్యార్థులతో బోధన సాగిస్తున్నారనే విమర్శలు వస్తున్నాయి. ఐటీఐ కాలేజీలకు అనుమతి ఇచ్చే సమయంలో పూర్తి స్థాయి అధ్యాపకులను చూపే యాజమాన్యాలు అనంతరం వారిని కొనసాగించడం లేదని తెలుస్తోంది. కేవలం కొందరి సర్టిఫికెట్లను తీసుకుని అధ్యాపకులుగా చూపుతున్నారని విమర్శలు వస్తున్నాయి.

ప్రాక్టికల్స్ లేవు..

ఐటీఐ అంటేనే ప్రాక్టికల్స్‌తో కూడి ఉన్న చదువు. కానీ జిల్లాలోని ఐటిఐలలో పారిశ్రామిక శిక్షణ తూతూ మంత్రంగా సాగుతోంది. సరైన పరికరాలు లేకపోవడంతో శిక్షణ సాగడం లేదు. మరమ్మతులకు నోచుకోని పరికరాలతో శిక్షణ సాగడం లేదు. పాడైపోయిన పరికరాలను బాగు చేయించకుండానే ప్రదర్శనకు ఉంచినట్లు చూపుతున్నారని విద్యార్థులు వాపోతున్నారు.కొన్ని ఐటీఐలు రేకుల షెడ్లలో నిర్వహిస్తూ ఎండలు అధికంగా ఉన్నప్పుడు చెట్ల కింద తరగతులు నిర్వహిస్తున్నారనే విమర్శలు వినపడుతున్నాయి.

హాజరు లేకున్నా..

ఆరు నెలల నుంచి రెండేళ్ల పాటు కొనసాగే పారిశ్రామిక శిక్షణా కాలంలో ప్రతీరోజు కాలేజీకీ వెళితేనే ఆయా ట్రేడ్‌లలో పట్టు లభిస్తుంది. అయితే చాలా కాలేజీలలో తరగతులకు రాకున్నా డబ్బులు తీసుకుని అటెండెన్స్ వేస్తున్నారనే విమర్శలు ఉన్నాయి. బయోమెట్రిక్ హాజరు విధానం అమలు లేకపోవడంతో ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. కాగా జిల్లాలోని పలు ఐటిఐ లు పాత భవనాలలో ఉండగా మరికొన్ని రేకుల షెడ్స్‌లో కొనసాగుతున్నాయి. ఇల్లెందు రోడ్‌లోని ఓ ఐటిఐ ఇటీవల భవనాన్ని కూల్చివేయటంతో విద్యార్థులను చెట్ల కిందే కూర్చోబెట్టి తరగతులు నిర్వహిస్తున్నట్టు చెబుతున్నారు. ఇక ప్రాక్టికల్స్‌కు సంబంధించి పరికరాలే లేవని, ప్రాక్టికల్స్‌కు విద్యార్థుల నుంచి డబ్బులు వసూళ్ళు చేసి పాస్ చేస్తున్నారనే విమర్శలు వినపడుతున్నాయి. ఉపాధి, శిక్షణ శాఖ అధికారులు ఐటీఐలపై పర్యవేక్షణ జరపాల్సి ఉంటుంది. జిల్లా స్థాయిలో ప్రభుత్వ ఐటీఐ ప్రిన్సిపాల్ నేరుగా పర్యవేక్షణ చేయాలి. అయితే ఈ అధికారులు నిమ్మకునీరెత్తినట్టుగా ఉండటంతో ప్రైవేటు ఐటీఐలు విద్యావ్యాపారం చేస్తున్నాయనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

ఆర్‌సీసీ భవనాల్లోనే క్లాసులు నిర్వహించాలి..

శ్రీనివాసరావు, ప్రిన్సిపాల్, ప్రభుత్వ ఐటీఐ, ఖమ్మం

జిల్లాలోని అన్ని ఐటీఐలు ఆర్‌సీసీ భవనాలలోనే క్లాసులు నిర్వహించాలి. ల్యాబ్‌లు మాత్రం ఆర్‌సీసీ భవనాలలో స్థలం లేకపోతే రేకుల షెడ్డులో ఏర్పాటు చేసుకోవచ్చు. విద్యార్థులకు ఇబ్బందులు లేకుండ , ప్రతి రోజు క్లాసులకు వచ్చేలా ప్రవేటు ఐటీఐ యజమానులు కృషి చేయాలి. ఎక్కడైన ఫిర్యాదులు వస్తేనే ప్రభుత్వ పరంగా తనిఖీలు చేసి ఆయా ఐటీఐలపై చర్యలు తీసుకుంటాం.

ప్రజలు మళ్లీ మోసపోరు..

(5వ పేజీ తరువాయి)



చేయలేదు. అధికారంలోకి రాగానే రూ.2లక్షల రుణమాఫీ చేస్తామని, రైతుభరోసా కింద రూ.15వేలు ఇస్తామని హామీ ఇచ్చి ప్రజలను మోసం చేసింది. అందుకే ప్రజలు కాంగ్రెస్‌ను నమ్మే పరిస్థితిలో లేరు. కేంద్రంలో మోదీ పాలనపట్ల కూడా ప్రజలు అసంతృప్తితో ఉన్నారు.

ప్ర: గత అసెంబ్లీ ఎన్నికల్లో మీ లోక్‌సభ నియోజకవర్గంలో అన్ని చోట్లా బీఆర్ఎస్ ఓడింది. కాంగ్రెస్‌కు భారీ మెజారిటీలు వచ్చాయి. ఈ పరిస్థితిలో మీ గెలుపు ఎలా సాధ్యం?

జ: 2018 అసెంబ్లీ ఎన్నికల్లో ఖమ్మం లోక్‌సభ నియోజకవర్గ పరిధిలో ఆరు చోట్ల కాంగ్రెస్ గెలవగా, ఒక్క ఖమ్మంలోనే బీఆర్ఎస్ గెలిచింది. ఆ తర్వాత 2019లోక్‌సభ ఎన్నికల్లో ఎంపీ అభ్యర్థిగా నన్ను భారీ మెజారిటీతో ప్రజలు గెలిపించారు. అదే ఆనవాయితీ ఈసారి కూడా పునరావృతం కాబోతోంది. అసెంబ్లీలో కాంగ్రెస్‌కు ఓటువేసినా లోక్‌సభలో బీఆర్ఎస్‌కు ఓటేసి గెలిపిస్తారన్న విశ్వాసం నాకుంది. లోక్‌సభ నియోజకవర్గంలోని మాజీ ఎమ్మెల్యేలు, బీఆర్ఎస్ స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు ఈ సారి కసిగా పని చేస్తున్నారు.

ప్ర: గెలిస్తే ఈసారి చేయబోయే పనులపై ప్రజలకు మీరిచ్చే హామీలు ఏమిటి?

జ: ఈ సారి కేంద్రంలో తటస్థ ఫలితాలుంటాయని బీఆర్ఎస్ నమ్ముతోంది. హంగ్ వస్తే బీఆర్ఎస్‌దే కీలకపాత్ర. కాబట్టి పెద్దఎత్తున జిల్లాకు నిధులు తెచ్చి జాతీయ రహదారులు, రైల్వేలైన్లు, కేంద్ర ప్రభుత్వ విద్యాసంస్థలు, పరిశ్రమలను ఏర్పాటు చేయించేందుకు కృషి చేస్తా. కేంద్ర విభజన చట్టంలోని బయ్యారం ఉక్కు పరిశ్రమ ఏర్పాటుకు కృషిచేస్తా. అలాగే కొత్తగూడెంలో ఎయిర్‌పోర్టు కోసం, కేంద్ర ప్రభుత్వ సంస్థలకు సంబంధించి, పథకాలకు సంబంధించిన పనులు, నిధులు రాబట్టేందుకు గట్టిగా పోరాడుతా.

విక్టరీ వెంకటేష్‌ను కలిసిన ఎమ్మెల్యే పాయం

మణుగూరు, మే 8: ఖమ్మం పార్లమెంట్ ఎన్నికల ప్రచార కార్యక్రమాలకు హాజరైన సినీ నటుడు విక్టరీ వెంకటేష్‌ను పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు మంగళవారం మర్యాద పూర్వకంగా కలుసుకున్నారు. ప్రచార విషయాలనుకాసేపు చర్చించారు. ఈ సందర్భంగా విక్టరీ వెంకటేశ్వర్లుతో కలసి ఫోటోలు దిగారు.


విక్టరీ వెంకటేష్‌తో పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు

కాగితాల్లోనే కొవ్వూరు రైల్వేలైన్

- ప్రతి ఎన్నికల్లోనూ పార్టీలకు ప్రచారాస్త్రం
- కొత్తగూడెం నుంచి అశ్వారావుపేట మీదుగా నిర్మాణానికి ప్రతిపాదన
- అయినా కార్యరూపం దాల్చని కొత్తట్రాక్
- దశాబ్దాల కల నెరవేరేదెన్నడో ?
- గత ఏడాది రైల్వే పబ్లిక్‌డొమైన్‌లో నోటిఫికేషన్

అశ్వారావుపేట, మే 8: దశాబ్దాల తెలుగు ప్రజల కల అయిన భద్రాచలం-కొవ్వూరు రైల్వేలైన్ నిర్మాణం ఇంకా కాగితాలకే పరిమితమైంది. ప్రతి ఎన్నికల సమయంలో ఈ రైల్వేలైన్ మంజూరు కోసం కృషి చేస్తామని ఆయా పార్టీ అభ్యర్థులు ప్రకటనలు గుప్పిస్తారు.. కానీ నేటికీ అది కార్యరూపం దాల్చలేదు. ఈ రైల్వేలైన్ మంజూరు కోసం భద్రాద్రి జిల్లాలోని కొందరు నాయకులు రైల్వేలైన్ సాధన కమిటీ ఏర్పాటు చేసి మరీ సుదీర్ఘకాలం పోరాటాలు చేశారు. అయినా ఈ లైన్‌కు మోక్షం లభించలేదు.

ప్రణాళిక ప్రకారం ఈ కొత్తలైన్‌ను కొత్తగూడెం నుంచి అశ్వారావుపేట మీదుగా కొవ్వూరు రైల్వేలైన్‌కు కలపాల్సి ఉంది. దశాబ్దం క్రితం ఈ రైల్వేలైన్ నిర్మాణం కోసం అవసరమైన భూసేకరణ వివరాలు, వంతెనలు, స్టేషన్‌లు ఎక్కడెక్కడ పెట్టాలనేదానిపై సర్వే చేపట్టారు. ఈ మేరకు ఈ రైల్వేలైన్ వెళ్లే మార్గాన్ని అధికారులు సర్వే చేసి మార్కింగ్ కూడా చేశారు. దీంతో ఎన్నో దశాబ్దాల కల నెరవేరుతుందని అందరూ భావించారు. ఈ లైన్ నిర్మాణానికి భూసేకరణ, రాష్ట్రవాటాను రైల్వేశాఖకు ఇవ్వాల్సి ఉంటుంది. వీటిని సమకూర్చడంలో రాష్ట్ర ప్రభుత్వాలు తగిన శ్రద్ధ చూపకపోవడమో లేక మరే ఇతర కారణాలో కానీ ఆ తరువాత ఈ లైన్ ఊసేలేకుండా పోయింది.

కొత్తగూడెం నుంచి సత్తుపల్లి సింగరేణి బొగ్గు రవాణా అవసరాల నిమిత్తం సింగరేణి తన వాటా సొమ్మును చెల్లించడానికి ముందుకు రావడంతో సత్తుపల్లి వరకు ఈ రైల్వేలైన్ నిర్మాణాన్ని పొడిగించారు. ఈ మేరకు పనులు పూర్తయ్యాయి. అయితే ఇప్పటికే సత్తుపల్లి వరకు రైల్వేలైన్ రావడంతో అక్కడ నుంచి గ్రీన్‌ఫీల్డ్ హైవేకు సమాంతరంగా కొవ్వూరు వరకు రైల్వేలైన్ మంజూరైందని, ఇప్పటికే భూసేకరణ పనులు ప్రారంభమయ్యాయని రైల్వేశాఖకు చెందిన పబ్లిక్ డొమైన్‌లో దీనికి వివరాలు కనిపించడంతో రైల్వేలైన్ మార్గంలో కొన్ని మార్పులు జరిగినా లైన్ పూర్తి అవుతుందని అందరూ ఆశించారు. కానీ ఇప్పటి వరకు ఈ లైన్ పనుల్లో ఏ మాత్రం పురోగతి కనిపించడం లేదు.

ఈ నేపథ్యంలోనే మళ్లీ లోక్‌సభ ఎన్నికలు రావడంతో మరోసారి భద్రాచలం-కొవ్వూరు రైల్వేలైన్ అంశం చర్చనీయాంశంగా మారింది. అసలు ఈలైన్ మంజూరైందా లేదా.. ఒకవేళ మంజూరైతే నిర్మాణంలో ఎందుకు ఆలస్యం జరుగుతోందనే విషయాలపై ప్రజలలో తీవ్ర చర్చ జరుగుతోంది. కేవలం ఒకరిపై ఒకరు విమర్శించుకోవడం, ఆరోపణలు, ప్రత్యారోపణలతోనే కాలం వెల్లదీస్తున్నారే తప్ప సుదీర్ఘకాల సమస్య అయిన కొవ్వూరు రైల్వేలైన్ విషయాన్ని అభ్యర్థులు ప్రచారంలో పేర్కొనకపోవడం చర్చనీయాంశంగా మారింది. ప్రజలు దీనిపై ఎన్నికల్లో ఎలా స్పందిస్తారో వేచి చూడాల్సిందే.

ఎన్నికలు స్వేచ్ఛగా జరిగేలా చూడాలి

- సమీక్ష సమావేశంలో కలెక్టర్ గౌతమ్


మాట్లాడుతున్న రిటర్నింగ్ అధికారి గౌతమ్

ఖమ్మం కలెక్టరేట్, మే 8: ఈ ఎన్నికల్లో ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు అప్రమత్తంగా పనిచేయాలని ఖమ్మం పార్లమెంట్ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ వీపీ గౌతమ్ ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఎన్నికల వ్యయ పరిశీలకులు అరుణ్ ప్రసాత్ కృష్ణసామి, శంకర నంద్ మిశ్రా, ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలతో ఆయన సమీక్ష నిర్వహించారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, పోలింగ్ ప్రక్రియ సమీపిస్తున్న నేపథ్యంలో స్వేచ్ఛాయుత వాతావరణంలో ఎన్నికల నిర్వహణకు కృషి చేయాలన్నారు. పోలింగ్‌కు ముందు నిరంతరం అప్రమత్తంగా ఉంటూ, పటిష్ట నిఘా పెట్టాలన్నారు. సీజర్స్‌పై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. ఎన్నికల్లో ప్రతిఒక్కరు సమానమని, అందరికీ సమాన అవకాశం ఇవ్వాలన్నారు. ఫంక్షన్ హాళ్లు, గోడౌన్ల తనిఖీలు చేపట్టాలన్నారు. ఎస్ఎస్టీ చెక్ పోస్టుల పర్యవేక్షణ చేయాలన్నారు. వాహనాల ద్వారా ప్రజల్లో ఎన్నికల పట్ల అవగాహన కల్పించాలన్నారు.

పోలింగ్ రోజున ఫ్లయింగ్ స్క్వాడ్ పాత్ర ఎంతో కీలకమని, వారి పరిధిలోని పోలింగ్ కేంద్రాల వద్ద పహారా చేయాలన్నారు. పోలింగ్ టర్నోవర్ తక్కువ ఉన్న పోలింగ్ కేంద్రాల పరిధిలో పర్యటించి, సమస్యలు ఉంటే వెంటనే చర్యలు తీసుకోవాలన్నారు. ఓటర్లను భయభ్రాంతులకు గురిచేయడం, ప్రలోభ పెట్టడం చేస్తే, క్విక్ రెస్పాన్స్ టీమ్‌కి సమాచారం ఇచ్చి, వెంటనే చర్యలు చేపట్టాలన్నారు. రైల్వేస్టేషన్లలో తనిఖీలు చేపట్టాలని, గూడ్స్ సెక్షన్‌లోనూ తనిఖీలు చేయాలని అన్నారు.

వ్యయ పరిశీలకుడు అరుణ్ ప్రసాత్ కృష్ణసామి మాట్లాడుతూ, ఓటర్ల ఫిర్యాదులకు వెంటనే స్పందించి, పరిష్కరించాలని, ఫిర్యాదు పరిష్కారం అవుతుందనే నమ్మకం ఓటర్లలో కల్పించాలన్నారు. సున్నిత ప్రాంతాలను గుర్తించి, ఆ ప్రాంతాలను సందర్శిస్తూ ఉండాలన్నారు. ప్రచార వాహన అనుమతులను తనిఖీ చేయాలన్నారు. వ్యయ పరిశీలకుడు శంకర నంద్ మిశ్రా మాట్లాడుతూ, ఎక్స్పెండిచర్ సెన్సిటివ్ జోన్లు, స్లమ్ ప్రాంతాలు గుర్తించి, వాటిపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు.

ఎన్నికల్లో డబ్బు, మద్యం, ప్రలోభాల నియంత్రణకు చర్యలు తీసుకోవాలన్నారు. సీ-విజిల్ యాప్ ఫిర్యాదులపై ఈ సందర్భంగా ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలతో సమీక్షించారు. ఈ సమావేశంలో కంట్రోల్ రూమ్ నోడల్ అధికారి, జిల్లా ముఖ్య ప్రణాళిక అధికారి ఏ.శ్రీనివాస్, వ్యయ నోడల్ అధికారి, జిల్లా సహకార అధికారి మురళీధర్‌రావు, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

నేడు ఇల్లెందులో మాజీ గవర్నర్ తమిళిసై రోడ్‌షో

ఇల్లెందు, మే 8: మహబూబాబాద్ లోక్‌సభ నియోజకవర్గ బీజేపీ అభ్యర్థి ప్రొఫెసర్ అజ్మీరా సీతారం నాయక్ విజయాన్ని కాంక్షిస్తూ ఇల్లెందులో గురువారం మాజీ గవర్నర్, బీజేపీ నేత తమిళిసై సౌందరరాజన్ రోడ్‌షో నిర్వహించనున్నారు. ఉదయం 11గంటలకు ఇల్లెందులోని గోవింద్‌సెంటర్ వద్ద ఈ రోడ్‌షో ప్రారంభమై ప్రధాన వీధుల్లో కొనసాగుతుంది. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని బీజేపీ ఇల్లెందు నియోజకవర్గ కన్వీనర్ బాలగాని గోపికృష్ణ తెలిపారు.

చికిత్స పొందుతూ మహిళ మృతి

దమ్మపేట, మే8: రోడ్డు ప్రమాదంలో గాయపడిన మహిళ చికిత్స పొందుతూ మృతి చెందిన సంఘటన గండుగులపల్లిలో బుధవారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గండుగులపల్లి గ్రామానికి చెందిన ఇంటిక సునీత (34) తన భర్త, పిల్లలతో కలిసి ద్విచక్రవాహనంపై ములకలపల్లి మండలం నర్సాపురం గ్రామానికి బంధువుల ఇంటికి వెళ్తున్నారు. ఈక్రమంలో పట్వారిగూడెం గ్రామ సమీపంలో కోతుల గుంపు ఒక్కసారిగా ద్విచక్రవాహనంపైకి రావడంతో సుధాకర్ వాహనాన్ని సడన్‌గా ఆపడంతో వెనుక కూర్చున్న ఆమె రోడ్డుపై పడి తీవ్రంగా గాయపడింది. చికిత్స నిమిత్తం ఆమెను ఖమ్మం తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందింది. మృతురాలి తండ్రి భద్రయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సాయికిషోర్‌రెడ్డి తెలిపారు.

వడదెబ్బతో వ్యాపారి మృతి


శ్రీనివాసరావు (ఫైల్)

పాల్వంచ, మే 8: వడదెబ్బతో ఓ వ్యాపారి మృతి చెందిన సంఘటన పాల్వంచలో చోటు చేసుకుంది. స్థానికుల తెలిపిన వివరాల ప్రకారం.. పాల్వంచ పట్టణ పరిధిలోని సీతరాంపట్నానికి చెందిన బోళ్ల శ్రీనివాసరావు(48) స్థానికంగా కిరాణాదుకాణం నిర్వహిస్తూ జీవనం సాగిస్తున్నాడు. రోజు మాదిరిగా బుధవారం మధ్యాహ్నం దుకాణానికి తాళం వేసి భోజనం చేయడానికి ఇంటికి బయలు దేరాడు. ఈక్రమంలో ఇంటి పరిసరాల్లోకి చేరుకోగానే అకస్మాత్తుగా సొమ్మసిల్లి రోడ్డుపై పడిపోయాడు. స్థానికులు, కుటుంబ సభ్యులు హుటాహుటిన ఆతడిని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వైద్యులు అతడిని పరీక్షించి మృతి చెందాడని నిర్ధారించారు. మృతుడికి భార్య, కుమారుడు ఉన్నారు.

పాల్వంచలో చోరీ

పాల్వంచ, మే8: పాల్వంచ కాంట్రాక్టర్స్ కాలనీలోని ఓ ఇంట్లో దొంగలు బంగారం, ఇతర అభరణాలు, నగదు చోరీ చేసిన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. స్థానికులు, బాధితుల తెలిపిన వివరాల ప్రకారం.. కాలనీలో నివాసం ఉండే ఉదయ్‌కుమార్ గత శనివారం కుటుంబ సభ్యులతో కలిసి ఊటీ వెళ్లాడు. ఇంట్లో ఎవ్వరూ లేని సమయంలో గుర్తు తెలియని వ్యక్తులు ఇంటి తలుపులను పగులగొట్టి బంగారం, ఇతర అభరణాలు చోరీ చేశారు. కాగా బుధవారం ఉదయం ఇంటి పని మనిషి వచ్చి చూసే సరికి తాళం పగులగొట్టి ఉండడంతో చుట్టూ పక్కల వారికి సమాచారం అందించింది. స్థానికులు వెంటనే డయల్ 100 ద్వారా పోలీసులకు సమాచారం చేరవేశారు. పోలీసులు, క్లూస్ టీం సభ్యులు పలు ఆధారాలు, సీసీ కెమెరాల పుటేజీని పరిశీలించారు. యజమాని ఉదయ్‌ను సంప్రదించగా తమ బంధువులు, పోలీసులు ఇంట్లో ప్రతి చోటా వెతికారని, కానీ బంగారు ఆభరణాలు దొరకలేదని, దీంతో 140 గ్రాముల బంగారు ఆభరణాలు అపహరణకు గురైనట్లు తాము నిర్ధారణకు వచ్చామని తెలిపారు. ఇంటి యజమాని తిరిగి వచ్చిన తరువాత అతని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేయాల్సి ఉందని పోలీసులు తెలిపారు.

భర్త కనిపించడం లేదని భార్య ఫిర్యాదు

పాల్వంచ, మే 8: భర్త కనిపించడం లేదని భార్య ఫిర్యాదు చేసిన సంఘటన మండల పరిధిలోని జగన్నాథపురంలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పాల్వంచ మండలం జగన్నాథపురం గ్రామానికి చెందిన ధారావత్ బాబూరావు లారీ డ్రైవర్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. మంగళవారం ఇంట్లోనే ఉండి తన భార్య శాంతితో ఘర్షణ పెట్టుకున్నాడు. అనంతరం ఇంటి నుంచి బయటకు వెళ్లి ఆమెకు ఫోన్ చేసి తాను పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకుంటానని బెదిరించాడు. ఆ తరువాత అతని ఫోన్ స్విచ్ ఆఫ్ రావడంతో ఆందోళన చెందిన ఆమె చుట్టుప్రక్కల గాలించినా ప్రయోజనం లేకపోవడంతో పోలీసులను ఆశ్రయించింది. ఆమె ఫిర్యాదు మేరకు మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు రూరల్ ఎస్ఐ శ్రీనివాస్ తెలిపారు.

పేకాట స్థావరంపై దాడి

దమ్మపేట, మే 8: మండల పరిధిలోని చిన్నగొల్లగూడెం గ్రామంలో పేకాట నిర్వహిస్తున్నారన్న సమాచారం మేరకు పోలీసులు బుధవారం స్థావరంపై దాడి చేశారు. ఈదాడుల్లో ఆరుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకొని, వారి వద్ద నుంచి రూ. 2,650 నగదును స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ సాయికిషోర్‌రెడ్డి తెలిపారు.

సిరుల పట్టు..



- లాభాల కురిపించనున్న దసలి పట్టు పురుగుల పెంపకం
- ఉపాధిపొందుతున్న పలువురు రైతులు

ఖమ్మం వ్యవసాయం, మే 8: రైతులు సంప్రదాయ పంటలతో నష్టపోకుండా పట్టు పరిశ్రమ చేపట్టి నెలవారీ ఆదాయాన్ని పొంది అభివృద్ధి పథం వైపు పలువురు రైతులు సాగుతున్నారు.

ఖమ్మం జిల్లాలో పట్టు పరిశ్రమను ప్రస్తుతం ముదిగొండ, కుసుమంచి, తిరుమలయపాలెం మండలాల్లో సుమారు 150 ఎకరాలలో 60 మంది రైతులు సాగు చేస్తున్నారు. మల్బరీ సాగు రైతన్నలకు ఆశాజనకంగా నిలుస్తుంది. రెండేళ్ల నుంచి పట్టుగూళ్ల ధరలు కిలోకి రూ.300 పైబడి నిలకడగా ఉండడంతో రైతులకు మంచి గిట్టుబాటు పంటగా మల్బరీ సాగు చేయూత ఇస్తున్నది. ఈ ఏడాది పట్టుగుళ్ల ధర కిలోకి రూ.600 అమ్ముడవుతున్నది. తెలంగాణ రాష్ట్రంలో జనగాం, హైదరాబాద్ మార్కెట్లో నాణ్యతను బట్టి రూ. 665 అత్యంత అధిక ధరను కూడా చెల్లించడం జరుగుతున్నది. ఖమ్మం రైతులు ఈ ఏడాది జూన్ మొదలుకొని ఇప్పటి వరకు సరాసరి 4 నుంచి 6 పంటలు తీసి రూ.50 వేల నుంచి 2 లక్షల పైచిలుకు ఆదాయాన్ని ఆర్జిస్తున్నారు.

మల్బరీ సాగు కోసం ఈ కింది పద్ధతులు పాటించాలి...

పట్టు పరిశ్రమపై ఆసక్తి కలిగిన రైతులు కనీసం రెండు ఎకరాల్లో నారు మొక్కల ద్వారా నాటాలి. సుమారు 10,000 నుంచి 11,000 మల్బరీ నారు మొక్కలు నాటుకొని తోట వృద్ధి చేసుకోవాలి. మొక్కలు నాటుటకు ముందుగానే మొక్కల మధ్య ఖాళీ ఉంచుకుని డ్రిప్ ఏర్పాటు చేసుకోవాలి. సేంద్రియ ఎరువులు ఒక ఏడాది గాను రెండు ఎకరాల్లో 16 టన్నులు విధిగా వాడాలి. దీని వలన భూమి సారవంతముగా ఉంటుంది. తద్వారా మంచి నాణ్యత కలిగిన ఆకు దిగుబడి వస్తుంది.

మల్బరీ తోట తొలకరి జల్లులు ఆరంభం కాగానే పెంపుదల చేయాలి. సెప్టెంబర్ మాసంలో మల్బరీ ఆకు కోతలకు సిద్ధం చేయాలి. తోట నాటిన మొదటి ఏడాది కేవలం 2-3 పంటలు మాత్రమే తీయగలము. కానీ రెండో ఏడాది నుంచి 6-8 పంటలు సులభంగా తీయగలము. పట్టు పురుగులు పెంచుటకు గాను 1000 చదరపు అడుగులు గది నిర్మాణము చేయవలసి ఉన్నది. గది యందు 2 తలుపులు 8 కిటికీలు 24 వెంటిలేటర్లు అన్ని ఒక దాని ఎదురుగా అమర్చవలసి ఉంటుంది. 9 పట్టు పురుగులు పెంచి పంట తీయుటకుగాను సుమారు 30 రోజులు సమయం పడుతుంది. రేరింగ్ గదిలో సుమారు 250-300 పట్టు గుడ్లలో నుంచి వచ్చిన పట్టు పురుగులు అనగా సుమారు 1,40,000- 1,65,000 పురుగుల వరకు పెంపకపు గదిలో పెంచబడును పట్టు పురుగు సుమారు 22-25 రోజులు మల్బరీ ఆకుతో మేపబడి అటు తర్వాత పట్టుగూడు అల్లుకొని పీపాగా మారుతుంది. అట్టి పట్టుగూళ్లు తయారైన పిమ్మట రైతులు గూళ్లను పట్టు గూళ్ల విక్రయ కేంద్రములో విక్రయించాలి.

అట్టి పట్టుగూళ్లు దిగుబడి సుమారుగా 100 గుడ్లకు గాను 70 కిలోల పట్టుగూళ్ల దిగుబడి వస్తుంది. ఒక పంటకు సుమారు 175 కిలోల నుంచి 210 కిలోలవరకు పంట వస్తుంది. ఆ గూళ్లను అమ్ముకోవడం ద్వారా రైతులకు రూ.350/ నుంచి 450/- కిలో ఒక్కింటికి ధర పలుకుతుంది. ఒక్క పంటకు గాను సుమారు రూ.50,000/- నుంచి రు. 70,000/- వరకు ఆర్జించగలరు..

ఇతర వివరాల కోసం ఖమ్మం పట్టుపరిశ్రమ ఉపసంచాలకులు సాగి రవి 91778 27392, సురేష్, సహాయ పట్టుపరిశ్రమ అధికారి, 99667 57765, శ్రీనివాసరావు, సహాయ పట్టుపరిశ్రమ అధికారి 90050 1500 నెంబర్లను సంప్రదించవచ్చు.

ఏకలవ్య ఇంటర్ కళాశాలల్లో ప్రవేశాలకు దరఖాస్తులు

భద్రాచలం, మే 8: భద్రాచలం ఐటీడీఏ పరిధిలోని ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ఉన్న ఎనిమిది ఏకలవ్య మోడల్ సంక్షేమ విద్యాలయాల్లో ఇంటర్ మొదటి సంవత్సరం ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు భద్రాచలం ఐటీడీఏ పీవో ప్రతీక్‌జైన్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. పదో తరగతి ఉత్తీర్ణులైన గిరిజన బాల బాలికలు సీజీపీ/సీబీఎ్‌ఎస్ఈ మెరిట్ మార్కుల ఆధారంగా అడ్మిషన్ లభిస్తుందని పేర్కొన్నారు. ఈ నెల 24న ఈఎంఆర్ఎస్ చర్ల, భద్రాచలంలో నిర్వహించే కౌన్సిలింగ్‌కు హాజరు కావాలని తెలిపారు. దరఖాస్తు ఫారాలను మీ దగ్గరలోని సంబంధిత విద్యాలయాల్లో పొందాలని తెలిపారు.

హైవోల్టేజీతో విద్యుత్ పరికరాలు ధ్వంసం

కల్లూరు, మే 8: హైవోల్టేజీ విద్యుత్ సరఫరాతో రూ.2లక్షల విలువైన ఎలక్ట్రానిక్ పరికరాలు ధ్వంసమైన సంఘటన కల్లూరు పంచాయతీ పరిధిలో గల ఖాన్‌ఖాన్‌పేట గ్రామంలో చోటు చేసుకుంది. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. మంగళవారం సాయంత్రం గ్రామంలో వీచిన గాలిదుమారం అనంతరం విద్యుత్ సరఫరా హైవోల్టేజీగా వచ్చింది. దీంతో గ్రామంలోని పలువురి ఇళ్లల్లో టీవీలు, ఫ్రిజ్లు, ఫ్యాన్లు, విద్యుత్ బల్బులు కాలిపోయాయని పేర్కొన్నారు. ఈ విషయమై విద్యుత్ శాఖ ఏఈ గణేష్ వివరణ ఇస్తూ గాలి దుమారంతో ఆకస్మాత్తుగా హైవోల్టేజీ విద్యుత్ సరఫరా అయిందని అన్నారు.

అక్రమ నగదు, మద్యం రవాణాను అరికట్టాలి

- ఎస్పీ రోహిత్‌రాజు


ఇల్లెందులో చెక్‌పోస్టును తనిఖీ చేస్తున్న ఎస్పీ రోహిత్‌రాజు

కొత్తగూడెం,(ఆంధ్రజ్యోతి)/టేకులపల్లి/ఇల్లెందు, మే8: అక్రమ నగదు, మద్యం రవాణాను సమర్థవంతంగా అరికట్టాలని జిల్లా ఎస్పీ రోహిత్‌రాజు అధికారులకు సూచించారు. బుధవారం ఇల్లెందు అసెంబ్లీ నియోజకవర్గంలో ఎన్నికల సంఘం ఆదేశాల ప్రకారం ఏర్పాటు చేసిన అంతర్ జిల్లా సరిహద్దు చెక్‌పోస్టులను తనిఖీ చేశారు. బొమ్మనపల్లి క్రాస్‌రోడ్డు, ఇల్లెందు లలితాపురం చెక్‌పోస్టులను తనిఖీ చేశారు. అనంతరం ఇల్లెందు సింగరేణి ఎయిడెడ్ హైస్కూల్‌లో స్ట్రాంగ్ రూం వద్ద భద్రతా ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ చెక్‌పోస్టుల వద్ద పని చేసే అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఓటర్లను ప్రలోభ పెట్టే విధంగా జరిగే నగదు, మద్యం అక్రమ రవాణాను అరికట్టాలని సూచించారు. చెక్ పోస్టుల వద్ద ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేయాలని ఆదేశించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలింగ్ ప్రక్రియ మొత్తం సజావుగా జరిగేలా అధికారులు బాధ్యతగా వ్యవహరించాలని అన్నారు. అనంతరం ఇల్లెందు పోలీస్‌స్టేషన్ పరిధిలోని పోలింగ్ స్టేషన్లు, రూట్‌మ్యాప్‌ల వివరాలను అడిగి తెలుసుకున్నారు. జిల్లా ప్రజలందరూ తమ ఓటు హక్కును నిర్భయంగా వినియోగించుకునేలా పకడ్బందీగా భద్రత ఏర్పాట్లను పూర్తి చేసినట్లు వెల్లడించారు. ఎస్పీ వెంట ఇల్లెందు డీఎస్పీ చంద్రభాను, సీఐ కరుణాకర్, ఎస్బీ ఇన్‌స్పెక్టర్ నాగరాజు, ఎస్ఐ సందీప్, సిబ్బంది ఉన్నారు.

విలీన మండలాలను తెలంగాణలో కలపాలని వినతి



మంత్రి తుమ్మలను సన్మానిస్తున్న శ్రీనివాస్

దమ్మపేట, మే8: ఆంధ్ర రాష్ట్రంలో కలిపిన మండలాలను తిరిగి తెలంగాణలో విలీనం చేయాలని కోరుతూ వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావుకు వినతిపత్రం అందజేశారు. గండాలకు చెందిన షెడ్యూలు కులాల పోరాట నాయకుడు బొమ్మర శ్రీనివాస్ ఆధ్వర్యంలో గండుగులపల్లిలోని ఆయన నివాసంలో మంత్రి తుమ్మలను బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయా మండలాల్లో ఉన్న ఏజెన్సీ సమస్యలను మంత్రి దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించాల్సిందిగా కోరారు. దీనిపై స్పందించిన మంత్రి తుమ్మల మాట్లాడుతూ పార్లమెంట్ ఎన్నికల అనంతరం ప్రభుత్వంతో మాట్లాడి సమస్యను పరిష్కరించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అనంతరం తుమ్మల స్థానిక నాయకులతో పార్లమెంటు ప్రచారంపై వివరాలను అడిగి తెలుసుకున్నారు. తుమ్మలను కలిసిన వారిలో కొయ్యల అచ్యుతరావు, కేవీ సత్యనారాయణ, కాసాని నాగప్రసాద్ తదితరులున్నారు.

భద్రాద్రి రామయ్యకు అభిషేకం


నిత్యకల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

భద్రాచలం, మే 8: భద్రాచలంలోని సీతారామచంద్రస్వామి వారికి బుధవారం ప్రత్యేక అభిషేకం నిర్వహించారు. అలాగే నిత్యకల్యాణ మండపంలో స్వామి వారికి నిత్యకల్యాణం వైభవంగా జరిగింది. విశ్వక్సేన పూజ, పుణ్యాహవచనం, కంకణధారణ, జీలకర్రబెల్లం, మాంగల్య ధారణ, వేద ఆశీర్వచనం నిర్వహించారు.

ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి

భద్రాద్రి కొత్తగూడెం
కొత్తగూడెం, ఇల్లెందు, భద్రాచలం, పినపాక, అశ్వారావుపేట
8
గురువారం 9 మే 2024

సాదాసీదాగా సర్వసభ్య సమావేశం


మాట్లాడుతున్న ఎంపీడీవో

దుమ్ముగూడెం మే 8: మండల ప్రజాపరిషత్ సర్వసభ్య సమావేశం బుధవారం సాదాసీదాగా జరిగింది. పలు ప్రజా సమస్యలను ఎంపీటీసీలు ప్రస్తావించారు. కెరేగుబల్లి గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాల మురికినీటితో గంగోలు చెరువు కలుషితమౌతోందని, ప్రత్యామ్నాయం చూపి చెరువు కలుషితమవకుండా చూడాలని ఎంపీటీసీ యలమంచి వంశీకృష్ణ కోరారు. అలాగే భూసార పరీక్షలు జరిపి నేలకు సరిపడే పంటల సాగును సూచించాలన్నారు. పలుశాఖల అధికారులు ప్రగతి నివేదికలను చదివి వినిపించారు. ఎంపీపీ రేసు లక్ష్మి, జడ్పీటీసీ సీతమ్మ, ఎంపీడీవో ఈదయ్య, ఎంపీవో ముత్యాలరావు, వైద్యాధికారి పుల్లారెడ్డి, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

కాంగ్రెస్ అభ్యర్థిని గెలిపించండి

- అశ్వారావుపేట ఎమ్మెల్యే జారే ఆదినారాయణ
- రఘురాంరెడ్డి విజయం కోసం విస్తృత ప్రచారం
- హస్తాన్ని గెలిపించాలని సీపీఐ, సీపీఎం, ఎన్డీ నాయకుల ప్రచారం

దమ్మపేట, మే 8: రెడ్యాలపాడు, మంగాపురం గ్రామాలలో జరుగుతున్న ఉపాధిపనుల కూలీల వద్దకు అశ్వారావుపేట ఎమ్మెల్యే జారే ఆదినారాయణ బుధవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఉపాధి సమస్యలు వివరాలను ఎమ్మెల్యే అడిగి తెలుసుకున్నారు. వేసవి జాగ్రత్తలు తీసుకోవాలని చూసించారు. కాంగ్రెస్ పార్టీ చేస్తున్న అభివృద్ధిని వివరిస్తూ ఖమ్మం కాంగ్రెసపార్టీ అభ్యర్థిగా రామసహాయం రఘురామిరెడ్డి పోటీ చేస్తున్నారు 13న జరిగే ఓటింగ్‌లో అందరు పాల్గొని చేతి గుర్తుపై ఓటు వేయాలని కోరారు.

రఘురాంరెడ్డికే మద్దతు: బీసీ సంక్షేమ సంఘం

అశ్వారావుపేట: వచ్చే లోక్‌సభ ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ నుంచి పార్లమెంట్ అభ్యర్థిగ పోటీ చేస్తున్న రామసహాయం రఘురాంరెడ్డికి బీసీ సంక్షేమ సంఘం పూర్తి మద్దతు ప్రకటిస్తున్నట్టు ఉమ్మడి జిల్లా బీసీ సంక్షేమ సంఘం అధ్యక్ష కార్యదర్శులు నారాయణవరపు శ్రీనివారావు, కృష్ణమాచారిలు ప్రకటించారు. బుధవారం అశ్వారావుపేటలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో బీసీ సంక్షేమ సంఘం అశ్వారావుపేట డివిజన్ కమిటీ నాయకులతో కలసి లింగిశెట్టి వెంకటేశ్వరరావు అధ్యక్షతన సమావేశం ఏర్పాటు చేశారు. సమావేశంలో పేరం నాగబాబు, యువజన నాయకులు దండాబత్తుల నరేష్, బండారు సాయి, ఎస్‌కె సలీమ్, వెంకన్న, కొట్టే శ్రీనివాసరావు, నరవల సర్వేశ్వరరావు, మంగరాజు, రాము, ఓదేలు, కాంతారావు, సాంబయ్య, వెంకన్న, బాబూరావు తదితరులు పాల్గొన్నారు.

మతోన్మాద బీజేపీని ఓడించండి: సీపీఎం

ములకలపల్లి: మతోన్మాద బీజేపీని ఓడించి ఇండియా కూటమి అభ్యర్థి రామసహాయం రఘురామరెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి అన్నవరపు కనకయ్య పిలుపునిచ్చారు. బుధవారం ములకలపల్లి మండల కేంద్రంలో జరిగిన సీపీఎం మండల స్థాయి జనరల్ బాడీ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఖమ్మం పార్లమెంట్ నియోజకవర్గ అభ్యర్థి రామసహాయం రఘురామరెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించడంలో పార్టీ శ్రేణులు అగ్రభాగంలో ఉండి పని చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో సీపీఎం జిల్లా జిల్లా కార్యదర్శివర్గసభ్యులు కే. పుల్లయ్య, మండల కార్యదర్శి ముదిగొండ రాంబాబు, నాయకులు పొడియం వెంకటేశ్వర్లు, గౌరి నాగేశ్వరరావు, వి. రవికుమార్, రావుజా, వీరస్వామి, ఆదినారాయణ, రామ్మూర్తి, సారయ్య, లక్ష్మినర్సయ్య, తిరుపతమ్మ, వెంకటేశ్వర్లు, వెంకట నర్సమ్మ, శ్రీను పాల్గొన్నారు.

ఇండియా కూటమి అభ్యర్థిని గెలిపించాలి: ఎన్‌డి

జూలూరుపాడు: పార్లమెంట్ ఎన్నికలలో ఖమ్మం ఎంపీగా ఇండియా కూటమి తరపున పోటి చేస్తున్న కాంగ్రెస్ అభ్యర్థి రామసహాయం రఘురాంరెడ్డిని గెలిపించాలని సీపీఐఎంఎల్ న్యూడెమోక్రసి జిల్లా నాయకులు ఎస్‌కె. ఉమర్ అన్నారు. బుధవారం జూలూరుపాడులో పార్టీ మండల కార్యదర్శి వల్లోజి రమేష్ అధ్యక్షతన ఆ పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశం జరిగింది. సమావేశంలో నాయకులు నరసింహారవు, గోపి, రామయ్యపాల్గొన్నారు.

సీపీఐ ఎన్నికల ప్రచారం

కొత్తగూడెం (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ఖమ్మం పార్లమెంట్ అభ్యర్థి రామసహాయం రఘురామరెడ్డి విజయాన్ని కాంక్షిస్తూ బుధవారం సీపీఐ ఆధ్వర్యంలో పట్టణంలోని పలు ప్రాంతాల్లో ఇంటింటా ఎన్నికల ప్రచార కార్యక్రమాన్ని నిర్వహించారు. సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కే. సాబీర్‌పాషా, నాయకులు దుగ్గిరాళి వెంకటేశ్వర్లు, వాసిరెడ్డి మురళీ, జమలయ్య, నగేష్, శ్రీనివాస్, ప్రశాంత్, గోనె సురేష్, నాగప్రసాద్, నిమ్మగడ్డ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ, బీఆర్‌ఎస్‌లకు బుద్ధి చెపుతాం: సీపీఐ

పాల్వంచ: పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ, బీఆర్‌ఎస్‌లకు బుద్ది చెపుతామని సీపీఐ రాష్ట్ర సమితి సభ్యులు ముత్యాల విశ్వనాధం అన్నారు. బుధవారం సీపీఐ బలపరిచిన కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి రామసహాయం రఘురాంరెడ్డి గెలుపును కాంక్షిస్తూ పాల్వంచ పట్టణ పరిధిలోని పలు వార్డుల్లో కరపత్రాలు పంచుతూ విస్తృత ప్రచారం నిర్వహించారు.కార్యక్రమంలో సీపీఐ పట్టణ కార్యదర్శి అడుసుమిల్లి సాయిబాబు, మండల కార్యదర్శి వీసంశెట్టి పూర్ణచంద్రరావు, జిల్లా సమితి సభ్యులు ఉప్పుశెట్టి రాహుల్, దుగ్గిరాల సుధాకర్, పద్మజ, శ్రీనివాసరావు, ముత్యాల కిరణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.


కొత్తగూడెంలో ప్రచారం నిర్వహిస్తున్న సీపీఐ

ఐఎన్‌టీయూసీ ప్రచారం

కొత్తగూడెం టౌన్: ఖమ్మం పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థి రఘురామరెడ్డి విజయాన్ని కాంక్షిస్తూ ఐఎన్‌టీయూసీ ఆధ్వర్యంలో బుధవారం కొత్తగూడెం ఏరియాలోని సింగరేణి మైన్స్, డిపార్టుమెంట్ల వద్ద ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఐఎన్‌టీయూసీ ప్రధాన కార్యదర్శి త్యాగరాజన్, కొత్తగూడెం ఏరియా ఉపాధ్యక్షులు ఎండి. రజాక్, యూనియన్ నాయకులు కాల్వ నాగభూషణం, కుమారస్వామి, భీముడు, ఎస్‌కే. గౌస్, బోటుక రాజేశ్వరరావు, చిలక రాజయ్య, సీపీఐ, సీపీఎం నాయకులు వాసిరెడ్డి ప్రసాద్, మధు, కృష్ణ, శ్రీరాములు, విప్లవ రెడ్డి, పోశం శ్రీనివాస్, రాజశేఖర్, జయరాజ్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌ని గెలిపించాలని ప్రచారం

జూలూరుపాడు: త్వరలో జరగబోయే పార్లమెంట్ ఎన్నికల్లో ఖమ్మం కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి రామసహాయం రఘురాంరెడ్డిని గెలిపించాలని కోరుతూ బుధవారం సాయంత్రం జూలూరుపాడులో కాంగ్రెస్, సీపీఐ, సీపీఎం నాయకులు ఉమ్మడి ప్రచారాన్ని నిర్వహించారు. కాంగ్రెస్ జిల్లా నాయకులు, సొసైటీ చైర్మన్ లేళ్ల వెంకటరెడ్డి, సీపీఐ మండల కార్యదర్శి గుండెపిన్ని వెంకటేశ్వర్లు, యాసా నరేష్, నున్న రంగారావు, సాయిల కృష్ణయ్య, నర్వనేని పుల్లారావు, వేల్పుల నర్సింహారావు, మోదుగు రామకృష్ణ, పోతురాజు నాగరాజు, జోగారావు, కిర్తణ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీ ఇంటింటి ప్రచారం

అన్నపురెడ్డిపల్లి: కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థి రామసహాయం రఘురాంరెడ్డి విజయం కోసం ఆ పార్టీ జిల్లా నాయకులు పర్సా వెంకటేశ్వరరావు బుధవారం అన్నపురెడ్డిపల్లిలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కాంగ్రెస్ నాయకులు జమలయ్య, సత్యం, పద్మ, శ్రీను ఉన్నారు.

బీఆర్‌ఎస్ అభ్యర్థి నామాను గెలిపించండి

- మాజీ ఎమ్మెల్యేలు మెచ్చా, తాటి ప్రచారం


మాట్లాడుతున్న మెచ్చా

దమ్మపేట, మే 8: తెలంగాణాలో కేసీఆర్ ఎంతో అభివృద్ధి చేశారని బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థిగా పోటి చేస్తున్న నామా నాగేశ్వరరావు అత్యధిక మెజారిటితో గెలిపించాలని మాజీ ఎమ్మెల్యేలు మెచ్చా నాగేశ్వరరావు, తాటి వెంకటేశ్వర్లు బుధవారం విస్తృతప్రచారం నిర్వహించారు. దమ్మపేట కంసాలివారి కుంట, మందలపల్లిలోని ఎర్రకుంట, గాంధీనగరంలోని వెంకయ్యకుంట వద్ద జరుగుతున్న ఉపాధి పనుల వద్దకు వెళ్లి కూలీల వద్ద ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ సొసైటి చైర్మన్ రావు జోగేశ్వరరావు, దారా యుగంధర్, దిశ కమిటి సభ్యులు గారపాటి సూర్యనారాయణ, దేవరపల్లి అజయ్‌కుమార్, బుడే, అబ్దుల్ జిన్నా తదితరులు పాల్గొన్నారు.

నామాను గెలిపించాలని కోరుతూ విస్తృత ప్రచారం

జూలూరుపాడు: బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి నామా నాగేశ్వరరావును గెలిపించాలని కోరుతూ బీఆర్‌ఎస్ నాయకులు మండలంలో విస్తృతంగా ప్రచారాన్ని నిర్వహించారు. బీఆర్‌ఎస్ జిల్లా అధికారి ప్రతినిధి లకావత్ గిరిబాబు పార్టీ జిల్లా నాయకులు యల్లంకి సత్యనారయణ, పిజి.కృష్ణమూర్తి, నాయకులు యదేళ్లపల్లి బీరభద్రం, చావా వెంకటరామరావు, భూక్య సేవా, మాజీ సర్పంచ్ భూక్య రాములు తదితరులు పాల్గొన్నారు.

సీతారాంనాయక్ విజయం కోసం ప్రచారం

పినపాక, మే 8: మనుకోట బీజేపీ ఎంపీ అభ్యర్థి ప్రొఫెసర్ అజ్మీర సీతారామ్‌నాయక్ గెలుపు కోరుతూ ఆ పార్టీ శ్రేణులు మండలంలో విస్తృత ప్రచారం చేస్తున్నారు. బీజేపీ మండలాధ్యక్షుడు ధూళిపూడి శివప్రసాద్ ఆధ్వర్యంలో బుధవారం మండలంలోని ఎల్చిరెడ్డిపల్లి ఎస్టీ కాలనీ, ఎస్సీ కాలనీ, వెంకట్రావుపేట, పోతురెడ్డిపల్లి గ్రామాల్లో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో మండల కార్యదర్శులు పాటిబండ్ల శ్రీనివాస్, పొనగంటి రామకృష్ణ, మహిళా మోర్చా అధ్యక్షురాలు కొట్టెం రమాదేవి, బూత్ అధ్యక్షులు పాల్గొన్నారు.

కాంగ్రెస్, బీఆర్‌ఎస్ ప్రచారాలు

ఇల్లెందుటౌన్, మే 8: మహబూబాబాద్ పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్, బీఆర్‌ఎస్ పార్టీల అభ్యర్థులను గెలిపించాలని కోరుతూ రెండు పార్టీల నాయకులు, కార్యకర్తలు ఇల్లెందు పట్టణంలో బుధవారం విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. వివిధ వార్డుల్లో ఇంటింటికి వెళ్లి మహిళలు, కార్మికులను కలిసి ఓట్లను అభ్యర్థించారు. ఈ కార్యక్రమాల్లో కాంగ్రెస్ నాయకులు దొడ్డా డానియల్, మడుగు సాంబమూర్తి, చిల్లా శ్రీనివాస్, సుదర్శన్ కోరి, ఎస్‌కే. జానీ, గోచికొండ శ్రీదేవి, స్వరూప పాల్గొన్నారు. బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో జరిగిన ప్రచారంలో జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ దిండిగల రాజేందర్, కౌన్సిలర్ జేకే. శ్రీనివాస్, పరుచూరి వెంకటేశ్వరరావు, నబీ తదితరులు పాల్గొన్నారు.

మోదీకి వ్యతిరేకంగా ఓటింగ్ చేయాలి

ఇల్లెందుటౌన్, మే 8: ప్రజావ్యతిరేక విధానాలు అవలంబిస్తున్న ప్రధాని మోదీకి వ్యతిరేకంగా ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని న్యూడెమోక్రసీ చంద్రన్న వర్గం జిల్లా నాయకులు బి. రాంసింగ్ పిలుపునిచ్చారు. బుధవారం స్థానిక కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కార్మికచట్టాలను మోదీ ప్రభుత్వం కాలరాసిందని విమర్శించారు. మతోన్మాదశక్తులను ఓడించి ప్రజాఉద్యమాలను బలపర్చాలని పిలుపునిచ్చారు. సమావేశంలో పీడీఎస్‌యూ రాష్ట్ర కార్యదర్శి ఎ. సాంబ, న్యూడెమోక్రసీ నాయకులు పొమయ్య, కాంతారావు, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన

బూర్గంపాడు, మే 8: బూర్గంపాడు మండల పరిదిలోని సారపాకలో గల పోలింగ్ కేంద్రాలను బుధవారం తహసీల్దార్ ముజాహిద్, ఎంపీడీవో జమలారెడ్డి పరిశీలించారు. ఈ నెల 13న ఎన్నికల నిర్వహణకు కేంద్రాలలో అవసరమైన ఏర్పాట్లను సిద్ధం చేయాలని సూచించారు. పోలింగ్ కేంద్రాలలో ఇంకా మిగిలి ఉన్న అవసరమైన ఏర్పాట్లను గుర్తించి పూర్తి స్థాయిలో వీలైనంత త్వరగా పూర్తి చేయాలని సిబ్బందికి సూచించారు. ఓటర్లుకు ఇబ్బంది లేకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేయాలన్నారు. వారి వెంట ఎంపీవో సునీల్, ఆర్‌ఐలు నరసింహరావు, ముత్తయ్య, ఏఎస్ఓ ప్రదీప్, పంచాయతీ కార్యదర్శులు మహేష్, వెంకట నాగిరెడ్డి ఉన్నారు.

తాగునీటి ఎద్దడిని తీర్చాలని గిరిజనుల నిరసన

జూలూరుపాడు. మే 8: మండలంలోని చింతలతండా పంచాయతి పరిధిలోని లైన్ తండా గ్రామంలో నెలకొన్న తాగునీటి ఎద్దడిని తీర్చాలని కోరుతూ బుధవారం గ్రామస్తులు నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. గ్రామంలోని రహదారిపై ఖాళీ బిందెలతో బైటాయించి నీటి ఎద్దడిని తీర్చాలని డిమండ్ చేశారు. నెల రోజులుగా గ్రామంలో తాగునీటి సరఫరా నిలచి పోయినప్పటికి అధికారులు చర్యలు తీసుకోకపోవటం తగదని అన్నారు.

బాలలకు నైతిక వికాస కార్యక్రమాలపై శిక్షణ

భద్రాచలం, మే 8: భద్రాచలంలోని వికాస తరంగిణి ఆధ్వర్యంలో ప్రజ్ఞ విభాగం ఆధ్వర్యంలో బాలలకు నైతిక వికాస కార్యక్రమంను ఈనెల 10 నుంచి 31 వరకు భద్రాచలంలోని జీయర్‌మఠంలో నిర్వహించడం జరుగుతుందని నిర్వాహకులు కమలా రాజశేఖర్, రఘుపుంగావాచార్యులు, చారుగుళ్ల శ్రీనివాస్ తెలిపారు. ప్రతి రోజు సాయంత్రం 5 నుంచి 6 వరకు గంటపాటు జరుగుతుందని తెలిపారు. ఈ ఉచిత వేసవి శిక్షణ శిబిరంలో పాల్గొనదలచిన 10న సాయంత్రం 5 గంటలకు శ్రీ జీయర్‌మఠం వద్ద హాజరుకావాలసిందిగా నిర్వాహకులు తెలిపారు.

సింగరేణి ఆసుపత్రిలో మౌలిక సదుపాయాలు కల్పించాలి


మాట్లాడుతున్న కేంద్రకమిటీ కార్యదర్శి వెంకట్

రుద్రంపూర్, (సింగరేణి) మే 8: సింగరేణి ప్రధాన ఆసుపత్రిలో రోగులకు అవసరమైన మౌలిక సదుపాయాలను ఏర్పాటు చేయడంలో యాజమాన్యం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందని సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ కేంద్రకమిటీ కార్యదర్శి వంగా వెంకట్ ఆరోపించారు. సింగరేణి యాజమాన్యం బొగ్గు ఉత్పత్తిపై చూపిస్తున్న ఆసక్తి కార్మిక సంక్షేమంపై చూపడం లేదని ఆరోపించారు. బుధవారం ప్రధాన ఆసుపత్రిలో రోగులు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకుని వాటి పరిష్కారానికి అవసరమైన చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులను కోరారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు మల్లిఖార్జున్, శ్రీనివాస్, కిష్టాఫర్, తోట రాజు, లక్ష్మినారాయణ, పద్మ, శాంతికుమార్ పాల్గొన్నారు.

బీజేపీకే టీడీపీ మద్దతు: తెలుగు యువత నాయకుడు

మణుగూరు, మే 8: తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు తెలంగాణలో జరగబోయే పార్లమెంట్ ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ శ్రేణులు భారతీయ జనతా పార్టీకి మద్దతు తెలపాలని తెలుగు యువత రాష్ట్ర నాయకులు మానుకొండ రఘురాం తెలిపారు. బుధవారం విలేకరులతో మాట్లాడారు. పార్టీ అధినేత ఆదేశాలను అంతా శిరస్సా వహించాలని తెలిపారు.

విత్తనాలు, ఎరువులు అందుబాటులో ఉంచాలి

- వ్యవసాయ అధికారులకు కలెక్టర్ ప్రియాంక ఆదేశం

కొత్తగూడెం, మే 8 (ఆంధ్రజ్యోతి): వర్షాకాలంలో రైతులకు సరిపడ విత్తనాలు, ఎరువులు అందుబాటులో ఉంచాలని కలెక్టర్ ప్రియాంక అల అధికారులకు సూచించారు. బుధవారం ఐడీఓసీ సమావేశ మందిరంలో జిల్లాలో రాబోయే వర్షాకాలం సీజన్‌కు సంబంధించిన విత్తనాలు, ఎరువుల ఏర్పాటు ప్రణాళిక సమావేశాన్ని నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో సాగువిస్తీర్ణం ఆధారంగా కావాల్సిన పత్తి, మొక్కజొన్న, మిర్చి విత్తనాలను అందుబాటులో ఉంచాలన్నారు, విత్తనాల కొరత లేకుండ చూడాలని, పత్తి విత్తనాలను గరిష్ట అమ్మకం రూ.864 ప్యాకెట్ చొప్పున మాత్రమే అమ్మాలని ఆదేశించారు. నకిలి విత్తనాలను అమ్మినట్లు తెలిస్తే సంబంధిత డీలర్లపై చట్టపరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వ్యవసాయ శాఖాధికారులు నాణ్యమైన విత్తనాలను రైతులు సాగు చేసేలా రైతువేదికలో అవగాహన కార్యక్రమాలను నిర్వహించాలని ఆదేశించారు. రాబోయే వర్షాకాలంలో సాధారణ వర్షపాతం నమోదయ్యే అవకాశాలు ఉన్నాయని, సాగు విస్తీర్ణం పెరుగుతుందని దానికి అనుగుణంగా విత్తనాలను ప్రణాళిక బద్ధంగా అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని వ్యవసాయశాఖ, డీలర్లను ఆదేశించారు. జిల్లాలో పత్తి 2,16,625 ఎకరాల్లో, మొక్కజొన్న 60వేల 200 ఎకరాల్లో, మిరప 32వేల 168 ఎకరాల్లో సాగు ప్రణాళిక ఉందని దానికి అనుగుణంగా విత్తనాలతో పాటు ఎరువులు అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. డీలర్లు విత్తనాలను అమ్మేటప్పుడు రైతులకు తప్పని సరిగా బిల్లు ఇవ్వాలని సూచించారు. రైతులు లూజుగా విత్తనాలను, గుడ్డసంచుల్లో విత్తనాలను కొనుగోలు చేయరాదని కోరారు. వ్యవసాయశాఖాధికారులు విత్తనాల నమూనాలను సేకరించి విశ్లేషణ ప్రకారం విత్తనాలను అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. జిల్లాలో ఉపాధి హామీ పథకంలో చెరువుల్లో పూడికతీసిన మట్టిని పంటచేలల్లో వాడుకునే లాగా రైతులకు అవగాహన కల్పించాలని ఆదేశించారు. ఈ సమావేశంలో వ్యవసాయశాఖ అధికారి బాబురావు, జిల్లా ఉద్యాన, పట్టు పరిశ్రమల అధికారి సూర్యనారాయణ, జిల్లా సహకార శాఖ అధికారి ఖుర్షీద్, జిల్లా డివిజన్ స్థాయి వ్యవసాయ సంచాలకులు, మండల వ్యవసాయ అధికారులు, విత్తనాలు, ఎరువుల డీలర్లు తదితరులు పాల్గొన్నారు.

ప్రతీ ఒక్కరు ఓటు హక్కు వినియోగించుకోవాలి

- జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ప్రియాంక


ప్రతిజ్ఞ చేస్తున్న కలెక్టర్, అధికారులు

కొత్తగూడెం, మే 8 (ఆంధ్రజ్యోతి): ప్రతిఒక్కరు ఓటు హక్కు వినియోగించుకోవాలని జిల్లా ఎన్నికల అధికారి ప్రియాంక తెలిపారు. బుధవారం ఐడీఓసీ కార్యాలయంలో డీఆర్డీవో, డీడబ్ల్యువో, మెప్మా సంయుక్త ఆధ్వర్యంలో ఓటరు అవర్నేస్ ప్రోగ్రాం స్వీప్ ప్రోగ్రాం నిర్వహించారు. జిల్లా ఎన్నికల అధికారి ప్రియాంక మహిళలందరితో ఓటు హక్కు వినియోగించుకుంటామని ప్రతిజ్ఞ చేయించారు. కలెక్టర్ మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో ప్రతి ఓటు ఎంతో విలువైందని, దీనిని గమనించి అర్హులైన మహిళలందరు ఓటుహక్కును వినియోగించుకోవాలని ఆమె పిలుపునిచ్చారు.ప్రజాస్వామ్య వ్యవస్థ మనుగడలో మహిళలు మూలస్తంభాలని వ్యాఖ్యానించారు. ఈ కార్యక్రమంలో భాగంగా 100మంది మహిళలతో ముగ్గుల పోటీలను నిర్వహించారు. ఈ ముగ్గుల పోటీ కార్యక్రమంలో జిల్లా సమాఖ్య, మండల సమాఖ్య, మెప్మా మహిళలు, ఐసీడీఎస్, ఐడీఓసీలోని మహిళా ఉద్యోగులు పాల్గొన్నారు. పోటీలో పాల్గొన్న అభ్యర్థులను కలెక్టర్ అభినందించారు. ఈ ముగ్గుల పోటీ కార్యక్రమంకు జిల్లా ఇండర్మిడియట్ అధికారి సులోచన రాణి, బీసీ వెల్ఫేర్ అధికారి ఇందిరా, ఎస్సీ డవలప్‌మెంట్ అధికారి అనసూయ, న్యాయ నిర్ణేతలుగా వ్యవహరించారు. అనంతరం పోటీల్లో గెలిచిన వారికి బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో డీఆర్డీవో విద్యాచందన, టిడబ్ల్యువో విజేత, పరిపాలన అధికారి గన్యా, మెప్మా పీడీ రాజేష్, డీఆర్డీఎ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్‌కేంద్రాల్లో అన్ని వసతులు కల్పించాలి

ఈ నెల 13న జరగనున్న లోక్‌సభ ఎన్నికల పోలింగ్‌కు ఓటర్లకు ఎలాంటి ఇబ్బందులు లేకుండ పోలింగ్ కేంద్రాల వద్ద టెంట్లు, తాగునీటి సౌకర్యం, విద్యుత్, రన్నింగ్ వాటర్ సౌకర్యం విధిగా ఏర్పాటు చేయాలని జిల్లా ఎన్నికల అధికారి ప్రియాంక అల ఎంపీడీవోలను ఆదేశించారు. బుధవారం జిల్లాలోని ఎంపీడీవో, ఎంఈవోలు, ఎంపీవోలు, ట్రైబల్ వెల్ఫేర్ ఈఈ, పోలింగ్ కేంద్రాలు నిర్వహించనున్న గ్రామసెక్రటరీలతో జిల్లా కలెక్టర్ టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. కొన్ని గ్రామాల్లో అమ్మ ఆదర్శ పాఠశాల పనులు ఇంకా పురోగతిలో ఉన్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. క్షేత్రస్థాయిలో ఉన్న సిబ్బంది అందరు విధిగా ఎన్నికల నియమావళి ఆచరించి విధులు చేయాలని పోలింగ్ అనంతరం జూన్ 5 వరకు ఎన్నికల నియమావళి ఉన్నందున అందరు జాగ్రత్తగా తమ విధులు నిర్వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విద్యాచందన, జిల్లా పంచాయతీ అధికారి చంద్రమౌళి, జిల్లా విద్యాశాఖ అధికారి వెంకటేశ్వరచారి పాల్గొన్నారు.

తలసీమియా వ్యాధిని అరికట్టాలి

- ఐఆర్‌ఎస్ జిల్లా కన్వీనర్ డాక్టర్ ఎస్‌ఎల్ కాంతారావు



ప్రసంగిస్తున్న డాక్టర్ ఎస్‌ఎల్ కాంతారావు

భద్రాచలం/కరకగూడెం, మే 8: తలసీమియా వ్యాధిని అరికట్టేందుకు ప్రతి ఒక్కరు సామాజిక స్పృహతో ముందుకు వచ్చి ప్రజల్లో ఈ వ్యాధి రాకుండా తగిన విధంగా ప్రచారం చేయాలని ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా కన్వీనరు డాక్టర్ ఎస్‌ఎల్ కాంతారావు అన్నారు. ప్రపంచ తలసీమియా దినోత్సవం సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ తలసీమియా వ్యాధి పుట్టుకతో సంక్రమించే తీవ్రమైన వ్యాధని, వారికి జీవితాంతం అవసరాన్ని బట్టి నెలకు, రెండు నెలలకు, మూడు నెలలకు, ఆరు నెలలకు, సంవత్సరానికి రక్తం ఎక్కించి చికిత్స అందించాల్సి ఉంటుందన్నా రు. అనంతరం వైద్యులు డాక్టర్ వి.జయభారతి, డా.పి.రాజశేఖర్‌లు మాట్లాడారు. శిబిరంలో వై.సూర్యనారాయణ, టి.సిద్దులు, జి.శంకర్‌రావు, డా. భాను ప్రసాద్, పి.కామేశ్వరరావు, బి.వెంకటరెడ్డి, జి.రాజారెడ్డి, జి.వెంకటాచారి, డా క్రాపా విజయ్‌లు పాల్గొన్నారు.

రక్త దాతలు ముందుకు రావాలి

కరకగూడెం, మే 8: రక్తదానం మహాదానమని దాతలు రక్తం ఇవ్వడానికి ముందుకు రావాలని విజయ బ్లడ్ బ్యాంక్ సంస్థ నియోజక వర్గ ఇన్‌చార్జ్ మెంతిని సాగర్ పిలుపునిచ్చారు. బుధవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ప్రమాదాలకు గురైన వారికి, తలసీమియాతో బాధపడే వారికి రక్తం అవసరం ఉంటుందన్నారు. అనేక మంది రక్తం దొరకక ప్రాణాప్రాయస్థితిలోకి చేరుకుంటు న్నారన్నారు. రక్తదానం చేసి ప్రాణదాతలు కావాలని పిలు పునిచ్చారు. రక్తదానంపై అపోహలు తొలగించారు.

బలరాంనాయక్ విజయాన్ని కాంక్షిస్తూ కాంగ్రెస్ ప్రచారం


ఓట్లు అభ్యర్థిస్తున్న ఎంపీపీ

అశ్వాపురం/మణుగూరు, మే 8: మహబూబాబాద్ పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థి పోరిక బలరాంనాయక్ విజయాన్ని కాంక్షిస్తూ బుధవారం కాంగ్రెస్ శ్రేణులు మండలంలో ముమ్మరంగా ప్రచారం చేపట్టాయి. మండల పరిధిలో పలు గ్రామపంచాయతీల్లో నాయకులు ఉపాధికూలీలను కలసి మజ్జిగ ప్యాకెట్లను అందజేసి ఓట్లు అభ్యర్థించారు. కేంద్రంలో ఇండియా కూటమి అధికారంలోకి రావాలంటే బలరాంనాయక్‌ను గెలిపించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ ముత్తినేని సుజాత, నియోజకవర్గ నాయకులు బట్టా విజయ్‌గాంధీ, గాదె కేశవరెడ్డి, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు ఓరుగంటి భిక్షమయ్య, నెల్లిపాక సింగిల్‌విండో చైర్మన్ మధుసూదన్‌రెడ్డి, ఎంపీటీసీలు కమటం నరేష్,బేతంరామకృష్ణ, మిత్రపక్షాల నాయకులు వెంకటేశ్వరరావు, సుధాకర్‌రెడ్డి నాయకులు పాల్గొన్నారు.

మణుగూరు: మణుగూరు మునిసిపాలిటీ పరిధిలోని చిన్నరావిగూడెం గ్రామంలో బుధవారం కాంగ్రెస్ పార్టీ నాయకులు కూచిపూడి బాబు విస్తృంగా ఎన్నికల ప్రచారాన్ని సాగించారు. పార్లమెంట్ ఎన్నికల్లో పోరిక బలరాంనాయక్‌ను గెలిపించాలని కోరారు.. కరపత్రాలను పంచుతూ స్థానిక నాయకులు హరిబాబు, సుబ్బలక్ష్మి, కుంజా నాగేశ్వరరావు తదితరులతో ప్రచారాన్ని సాగించారు.

మంత్రి పొంగులేటి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరిక

- ఎమ్మెల్యే పాయం ఆధ్వర్యంలో పినపాక వైస్ ఎంపీపీ సహా టీబీజీకేఎస్ నాయకుల చేరిక


వైస్ ఎంపీపీకి పార్టీ కండువా కప్పుతున్న మంత్రి

పినపాక, మే 8: 45 ఏళ్ల సుదీర్ఘ రాజకీయ అనుభవంతో పినపాక నియోజకవర్గంలో రాజకీయ భీష్ముడిగా గుర్తింపు పొందిన పినపాక మండలం వైస్ ఎంపీపీ కంది సుబ్బారెడ్డి స్థానిక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. బుధవారం ఖమ్మంలోని మంత్రి పొంగులేటి క్యాంపు కార్యాయంలో బీఆర్‌ఎస్ పార్టీకి గుడ్‌బై చెప్పి, కాంగ్రెస్ పార్టీలో చేరారు. మంత్రి పొంగులేటి కంది సుబ్బారెడ్డికి కాంగ్రెస్ పార్టీ కండువా కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. అనంతరం కంది సుబ్బారెడ్డి మాట్లాడారు. రాష్ట్రంలో సీఎం రేవంత్‌రెడ్డి పాలనాదక్షత, కాంగ్రెస్ పార్టీ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, ఆరు గ్యారంటీల అమలు, రైతు సంక్షేమం కోసం చేస్తున్న కృషిని చూసి పార్టీలో చేరుతున్నట్లు ప్రకటించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు గొడిశాల రామనాథం, మండల కాంగ్రెస్ నాయకులు గంగిరెడ్డి వెంకటరెడ్డి, ఉడుముల లక్ష్మారెడ్డి, గట్లా శ్రీనివాసరెడ్డి, ముక్కు వెంకటేశ్వరరెడ్డి, ఉడుముల రవీందర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

మణుగూరు, మే 8: మణుగూరు ఏరియా టీబీజీకేఎస్ బ్రాంచ్ ఉపాధ్యక్షుడు వూకంటి ప్రభాక ర్ రావు, మిగతా యూనియన్ నాయకులు బుధవారం కాంగ్రెస్‌లోకి చేరేందుకు సంసిద్ధమయ్యారు. బుధవారం తన అనుచర బలగంతో పాటు స్థానిక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో ఖమ్మం చేరుకుని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి సమక్షంలో కాంగ్రెస్ తీర్థం పుచ్చుకన్నారు. పార్టీలోని చేరేందుకు వచ్చిన మాజీ టీబీజీకేఎస్ నాయకులు వి ప్రభాకర్ అతని అనుచర నాయకులు కార్యకర్తలను మంత్రి పొంగులేటి ఆహ్వానించారు. కాంగ్రెస్ పార్టీ జెండాలను కప్పి ప్రభాకర్‌తో పాటు ఇతర నాయక వర్గాన్ని సాదరంగా ఆహ్వానించారు. దీంతో మణుగూరులో టిబిజీకేఎస్ యూనియన్ పూర్తి స్థాయిలో కుదేలైపోయింది. ఈయూనియన్‌కు నాధుడు లేకుండా పోయారు.నిన్నటి వరకు ప్రభాకర్ పయనం ఎటువైపు అన్న విషయంపై నెలకొన్న సందిగ్ధతకు తెరపడింది.

గాలి దుమారంతో ట్రాన్స్‌కోకు రూ.10 లక్షల నష్టం

- డీఈ జీవన్‌కుమార్
- నేలకొరిగిన 88 స్తంభాలు, 11 ట్రాన్స్‌ఫార్మర్‌లు


నేలకొరిగిన ట్రాన్స్‌ఫార్మర్‌ను పరిశీలిస్తున్న ట్రాన్స్‌కో డీఈ జీవన్‌కుమార్(ఫైల్)

భద్రాచలం, మే 8: ఇటీవల వారం రోజులుగా భద్రాచలం రెవెన్యూ డివిజన్ పరిధిలో గాలి దుమారంతో కురుస్తున్న భారీ వర్షాలకు ట్రాన్స్‌కోకు రూ.10 లక్షల నష్టం వాటిల్లింది. భద్రాచలం రెవెన్యూ డివిజన్ పరిధిలోని భద్రాచలం, దుమ్ముగూడెం, చర్ల బూర్గంపాడు, అశ్వాపురం, మణుగూరు, పినపాక, కరకగూడెం తదిరత మండలాల్లో ఇటీవల నిలిచిన భారీ గాలిదుమారాలతో 88 విద్యుత్తు స్తంభాలు, 11 ట్రాన్స్‌ఫార్మర్లు నేలకొరిగాయి. దీంతో వివిధ మండలాల్లో విద్యుతు సరఫరాకు అంతరాయం ఏర్పడింది. ఈ క్రమంలో ట్రాన్స్‌కో అధికారులు విద్యుతు సరఫరాను పునరుద్దరించేందుకు ఇప్పటికే చర్యలను చేపట్టగా చాలా చోట్ల ఇందుకు సంబంధించిన పనులు తుది దశకు చేరుకుంటున్నాయని అధికారులు పేర్కొంటున్నారు. గాలిదుమారాలు, భారీ వర్షాల నేపధ్యంలో ప్రతి సర్కిల్ పరిధిలో కంట్రోల్ రూము ఏర్పాటు చేసినట్లు ఇందులో 7901628365 నెంబరుకు 24 గంటల్లో ఏదైనా అత్యవసర సమాచారం ఉంటే తెలపాలని అధికారులు సూచిస్తున్నారు. విద్యుత్తు సరఫరా పునరుద్ధరించడానికి సెక్షన్ల పరంగా సిబ్బంది మెటీరియల్‌తో ఏజెన్సీలు పనుల్లో నిమగ్నమయ్యారని భద్రాచలం ట్రాన్స్‌కో డీఈ జీవన్‌కుమార్ తెలిపారు. ఎటువంటి విపత్కర పరిస్థితులు ఎదురైనా వినియోగదారులకు అంతరాయాలు లేకుండా విద్యుత్తు సరఫరా అందించడానికి తమ సిబ్బంది అహర్నిశలు కృషి చేస్తున్నారని తెలిపారు.

ఇది ఇలా ఉండగా భద్రాచలంలో లో ఓల్టేజీ సమస్యను పరిష్కరించేందుకు రూ.25లక్షలతో నాలుగు 160 కేవీ ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటుచేసినట్లు డీఈ జీవన్‌కుమార్ తెలిపారు. వీటిని బుధవారం ప్రారంభించినట్లు తెలిపారు.

పాల్వంచలో పోలీసుల ఫ్లాగ్‌మార్చ్

పాల్వంచ, మే 8: అతి త్వరలో జరుగనున్న పార్లమెంట్ ఎన్నికల్లో ప్రజలందరూ ప్రశాంత వాతవరణంలో నిర్భయంగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని పాల్వంచ డీఎస్పీ సతీష్ కుమార్ పిలుపునిచ్చారు. బుధవారం పాల్వంచ పట్టణంలోని పురవీధుల్లో స్థానిక సబ్ డివిజన్ పోలీసులు, కేంద్ర భద్రతా బలగాలతో కలసి ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. డీఎస్పీ మాట్లాడుతూ ఎటువంటి ప్రలోబాలకు గురికాకుండా ఓటుహక్కును వినియోగించుకోవాలని ప్రజలకు సూచించారు. ప్రశాంతమైన వాతావరణాన్ని కలుషితం చేయడానికి సంఘ విద్రోహ శక్తులు ఎప్పుడూ ప్రయత్నిస్తూనే ఉంటాయని, ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా వ్యవహరించి అటువంటి కుయుక్తులను తిప్పికొట్టాలని అన్నారు. ఈ కార్యక్రమంలో పాల్వంచ సీఐ వినయ్‌కుమార్, సబ్ ఇన్స్‌పెక్టర్లు బానాల రాము, సుమన్, గంజి స్వప్న, శ్రీనివాసరావు, నాగబిక్షం, రాఘవయ్య, పోలీస్ సిబ్బంది, కేంద్ర భద్రతా దళాలు పాల్గొన్నాయి.


ఫ్లాగ్‌మార్చ్ నిర్వహిస్తున్న పోలీసులు